# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 2-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:232 పేజీలు:6 వెల: రూ.1/-








# అభివృద్ధి బాటలో తెలంగాణ పయనం

## (02 జూన్ "తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం" సందర్భంగా)

దక్షిణం భారతంలో మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సరిహద్దులుగా 1,12,077 చ కి మీ విస్తీర్ణంతో దాదాపు 3.86 కోట్ల జనాభా కలిగిన తెలంగాణ రాష్ట్రం దశాబ్దాల పోరాట ఫలితంగా 02 జూన్ 2014న నాటి ఆంధ్రప్రదేశ్ విభజన ఫలితంగా ఏర్పడింది. హైదరాబాదు రాజధానిగా పలు 33 జిల్లాలతో 66.54 శాతం అక్షరాస్యతతో తెలంగాణ రాష్ట్రం సాంస్కృతిక వారసత్వం, చేనేత పరిశ్రమ, వ్యావసాయ ఆధారిత ఆర్థిక గమనం, ఆకర్షణీయ చారిత్రక కట్టడాలు, విలక్షణ సాఫ్ట్‌వేర్ కేంద్రంగా హైదరాబాదు నగరంతో విరాజిల్లుతున్నది. అనేక ప్రత్యేకతలతో విలక్షణ రీతిలో అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రేస్ ప్రభుత్వం పాలనను కొనసాగిస్తున్నది.

### 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భావం:

స్వాతంత్ర్యానికి ముందు నిజామ్ పాలనలో ఉన్న హైదరాబాదు రాష్ట్రం, 1948లో పోలీస్ ఆక్షన్ (ఆపరేషన్ పోలో) చొరవతో భారతదేశంలో విలీనం కావడం, 01 నవంబర్ 1956న భాష ప్రాతిపదికన ఆంధ్ర ప్రాంతంతో తెలంగాణను కలపడంతో ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నాటి ఆంధ్ర ప్రాంత ముఖ్యమంత్రులు/మంత్రులు పెద్దమనుషుల ఒప్పందాన్ని గాలికి వదిలేసి, తీవ్ర వివక్ష చూపుతూ తెలంగాణకు నీళ్లు, నిధులు, నియామకాల్లో అన్యాయం జరుగుతున్నదని, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు 1969లో తెలంగాణ పరిరక్షణ సమితి పేరుతో చెన్నారెడ్డి, కొండా లక్ష్మన్ బాపూజీ లాంటి మహానుభావుల నేతృత్వంలో ప్రజా ఉద్యానాలు ప్రారంభం అయ్యాయి. 2021లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా 17 మే 2001న కరీంనగర్‌లో సింహగర్జనతో మొదలైన ఉద్యమం ప్రొఫెసర్ కోదండరామ్ నాయకత్వంలో జాయింట్ ఆక్షన్ కమిటీ (జెఏసి), కెసిఆర్ నాయకత్వాన తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్)లు ఏర్పడడంతో శాంతియుత పోరాటాలు ఊపందుకోవడంతో విభజన వాదన మంటలు ఎగిసి పడ్డాయి. సుదీర్ఘ తెలంగాణ రాష్ట్ర ఉద్యమాల్లో కెసిఆర్ దీక్ష, మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె లాంటి ఉద్యమాలతో తెలంగాణ అట్టుడికి పోయింది. 1969 నుండి 2014 వరకు దశాబ్దాలుగా వివిధ దశల్లో కొనసాగిన తెలంగాణ ఉద్యమం దాదాపు 1500లకు పైగా ప్రాణాలను బలిగొంది. ప్రత్యేక తెలంగాణ కోసం 2010లో శ్రీ కృష్ణ కమిటీ ఏర్పడడం. 30 జూలై 2013న ప్రత్యేక తెలంగాణ కోరకు కాంగ్రేస్ వర్కింగ్ కమిటీ తీర్మానం చేయడం, 03 అక్టోబర్ 2013న కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలుపడం, 18 ఫిబ్రవరి 2014న లోకసభలో బిల్లు ఆమోదం పొందడం, 20 ఫిబ్రవరి 2014లో రాజ్యసభ ఆమోదం పొందడం జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ విభజన బిల్లు లేదా ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014ను 01 మార్చి 2014న రాష్ట్రపతి ఆమోదం లభించడం, 02 జూన్ 2014న 29వ రాష్ట్రంగా తెలంగాణ అవతరించడం జరిగిపోయింది. అదే సమయంలో ఆంధ్ర ప్రదేశ్ విభజనకు వ్యతిరేకంగా ఆంధ్ర ప్రజలు/పాలకులు పోరాటాలు జరగడంతో చివరకు కాంగ్రేస్, భాజపాలు అంగీకరించడంతో 02 జూన్ 2014న భారత దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం అవతరించింది.

### తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతలు:

భారత రాష్ట్రాల్లో 8వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ, తలసరి వార్షిక ఆదాయం 3.08 లక్షలు, 12.8 శాతం సగటు వార్షిక అభివృద్ధి రేటు, ఐటీ పరిశ్రమ ఊపు, పారిశ్రామిక ప్రగతి, వ్యవసాయం/పండ్ల ఉత్పత్తుల్లో ముందంజ, అపారమైన ఖనిజ సంపద, ప్రత్యేక సాంస్కృతిక (పేరిణ, కూచిపూడి, లంబాడీ, గుస్సాడీ నాట్యాలు) వారసత్వం, హస్తకళల కేంద్రం, వైవిధ్యభరిత పండుగలు (బతుకమ్మ, దసరా, సంక్రాంతి, బోనాలు, ఉగాది లాంటివి), పలురకాల రుచికరమైన. ఆహార పదార్థాలు (హైదరాబాదు బిర్యాని, గ్రామీణ వంటలు) లాంటి పలు ప్రత్యేకతలు తెలంగాణ సొంతం. తెలంగాణ రాష్ట్ర జంతువుగా జింక, రాష్ట్ర పక్షిగా పాలపిట్ట, రాష్ట్ర వృక్షంగా జమ్మి చెట్టు, రాష్ట్ర పువ్వుగా తంగేడు పువ్వును నిర్ణయించింది తొలి నూతన ప్రభుత్వం. తెలంగాణ రాష్ట్రంలో చార్మినార్, గోల్కొండ కోట, కుతుబ్ షాహి టోంబ్స్, వరంగల్ కోట, వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం, మక్కా మసీదు, పైఘా టోంబ్స్, చౌమల్లా ప్యాలేస్, పురానా హవేలి, బాసర సరస్వతి దేవాలయం లాంటి ప్రఖ్యాత చారిత్రాత్మక కట్టడాలు లేదా దర్శనీయ స్థలాలు ఉన్నాయి. తెలంగాణలో కన్వా, ఏటూర్నాగారం, పోచారం, ప్రాణహిత, కిన్నెరసాని, శివరాం, మంజీర వన్యప్రాణి అభయారణ్యాలు ఉన్నాయి. కసుగీయ్, మృగవాణి, మహావీర హరిణ వనస్థలి, కాసుబ్రాహ్మానందా రెడ్డి జాతీయ పార్కులకు తెలంగాణ నెలవుగా నిలుస్తున్నది.

02 జూన్ 2026న తెలంగాణ రాష్ట్రం 12వ అవతరణ వేడుకలను భవ్యంగా నిర్వహించుకుంటున్న వేళ రాష్ట్ర రాజధాని నుంచి గ్రామీణ పాఠశాల వరకు అన్ని ప్రదేశాలు/కార్యాలయాల్లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, పౌర సమాజ ఉత్సవాలు, విద్యాలయాల్లో చర్చలు/సదస్సులు, బాణాసంచా వెలుగులు, అమరవీరులకు నివాళులు లాంటి ఉత్సవాలు నిర్వహిస్తారు. 02 జూన్ వేదికగా తెలంగాణ రాష్ట్ర సమగ్ర సుస్థిరాభివృద్ధికి బాటలు వేయడానికి ప్రణాళికలు చేయడం, అమలుకు పూనుకోవడం జరుగుతోంది.



-మధుపాళీ
9949700037

# ఎన్నికల తర్వాత రాజకీయ విభేదాలు పక్కన పెట్టి అందరూ కలిసికట్టుగా అభివృద్ధి కోసం పనిచేయాలి: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, జూన్ 1:నేడు పనాజీలో జరిగిన గోవా 40వ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధా కృష్ణన్ అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. గోవా పూర్తి స్థాయి రాష్ట్ర హోదా పొంది నాలుగు దశాబ్దాలు (40 ఏళ్లు) పూర్తయిన ఈ చారిత్రాత్మక సందర్భంలో గోవా ప్రజలతో కలిసి పాల్గొనడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. తాను భారత ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గోవా రాష్ట్రంలో అధికారికంగా పర్యటించడం ఇదే తొలిసారి అని ఆయన గుర్తు చేశారు.

1987 మే 30న గోవా భారతదేశపు 25వ రాష్ట్రంగా ఆవిర్భవించిన చారిత్రక ప్రాముఖ్యతను ఉపరాష్ట్రపతి గుర్తు చేశారు. ఈరోజు గోవా ప్రజల విశిష్ట గుర్తింపు, ఆకాంక్షలు, ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటిచెబుతుందని ఉపరాష్ట్రపతి అన్నారు. గోవా రాష్ట్రం ఒకవైపు సంస్కృతి-ప్రగతికి... మరోవైపు సంప్రదాయం-ఆధునికతకు, ప్రాంతీయ గౌరవం-ప్రపంచ దృక్పథనాకి ఒక అద్భుతమైన కలయిక అని కొనియాడారు.

విద్య పట్ల గోవా ప్రజలకు ఉన్న నిబద్ధతను, వారి పౌర బాధ్యతను, సామాజిక సమ్మిళితత్వాన్ని ఉపరాష్ట్రపతి ఎంతగానో ప్రశంసించారు. రాష్ట్ర ప్రజల ఆప్యాయత, వారి ఆతిథ్య మర్యాదలు గోవాను నిజంగా ఒక ప్రత్యేకమైన రాష్ట్రంగా నిలబెట్టాయని చెప్పారు. అక్షరాస్యత, వైద్య సేవలు, పర్యావరణ అవగాహన, మానవాభివృద్ధి రంగాలు యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు.

గోవా మాజీ ముఖ్యమంత్రి శ్రీ మనోహర్ పారికర్‌కు ఉపరాష్ట్రపతి ఘన నివాళులు అర్పించారు. ఆయన్ను ఒక దార్శనిక నాయకుడిగా అభివర్ణించారు. పారికర్ గారి నిరాడంబరత, నిజాయితీ, అంకితభావం గోవా ప్రగతిపై చెరగని ముద్ర వేశాయని అన్నారు.

రాష్ట్రాన్ని ప్రగతి, శ్రేయస్సు వైపు నడిపిస్తున్న గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ నాయకత్వాన్ని ఉపరాష్ట్రపతి అభినందించారు. డాక్టర్ సావంత్ నాయకత్వంలో గోవా తన గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, గుర్తింపును కాపాడుకుంటూనే మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, పర్యాటకం, డిజిటల్ పాలన వంటి రంగాలలో గణనీయమైన పురోగతి సాధించిందని ఆయన అన్నారు.

దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాల గురించి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో, ముఖ్యంగా ఎన్నికల సమయంలో అభిప్రాయ భేదాలు, రాజకీయ పోటీలు సహజమని ఉపరాష్ట్రపతి అన్నారు. అయితే ఎన్నికల తర్వాత దేశాభివృద్ధి కోసం అన్ని వర్గాల వారు రాజకీయ విభేదాలు పక్కనబెట్టి సహకార స్ఫూర్తితో, సామూహిక బాధ్యతతో కలిసి పనిచేయాలని ఆయన చెప్పారు. గోవా చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం, బలమైన సామాజిక సంస్థలు... భాగస్వామ్యం, సంభాషణ, గౌరవానికి విలువనిచ్చే సమాజాన్ని ప్రతిబింబిస్తున్నాయని అన్నారు.

2047 నాటికి వికసిత్ భారత్ దార్శనికతను ప్రస్తావిస్తూ.. దేశ భవిష్యత్తు వృద్ధిలో గోవా కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. భారత్ పురోగతికి సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ ప్రధాన ఆధారంగా మారనుందని, ఈ రంగంలో గోవా అగ్రగామిగా ఎదుగుతుండటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. చదువుకున్న యువత, వ్యాపార నైపుణ్యం, వ్యూహాత్మక తీరప్రాంతం, అంతర్జాతీయ అనుసంధానత వంటి అనుకూలతల వల్ల దేశ తదుపరి దశ వృద్ధి, ఆవిష్కరణల్లో భాగస్వామ్యం కావడానికి గోవాకు అన్ని అర్హతలు ఉన్నాయని చెప్పారు.

ఆధునికతను ఆహ్వానిస్తూనే తమ సంప్రదాయాలను ఎలా కాపాడుకోవచ్చో, ప్రపంచ దేశాల ప్రజలను ఆదరిస్తూనే స్థానిక సంస్కృతిని ఎలా రక్షించుకోవచ్చో గోవా ప్రస్థానం నిరూపించిందని ఉపరాష్ట్రపతి వ్యాఖ్యానించారు. పర్యావరణానికి నష్టం లేని అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ.. స్థిరమైన తీరప్రాంత అభివృద్ధిలో గోవా దేశానికే ఒక ఆదర్శ నమూనాగా నిలవగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.

గోవా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ.. యువతలో ఉన్న సృజనాత్మకత, కొత్త ఆలోచనలను స్వీకరించే తత్వం, ఆత్మవిశ్వాసమే ఈ రాష్ట్రానికి ఉన్న అతిపెద్ద బలమని చెప్పారు. వ్యాపార రంగం, శాస్త్రం, కళలు, క్రీడలు, సరికొత్త ఆవిష్కరణలు, సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో యువత చురుగ్గా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

సంస్కృతిలో చైతన్యవంతంగా, ఆర్థికంగా బలంగా, భవిష్యత్తుపై నమ్మకంతో కూడిన గోవాను నిర్మించడానికి ఐక్యత, శ్రేయస్సు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సామరస్యంతో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పౌరులను కోరారు.

ఈ వేడుకల సందర్భంగా పనాజీలోని కళా అకాడమీలో ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ మారియో మిరాండా జీవితం, ఆయన చేసిన కృషిపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఉపరాష్ట్రపతి ప్రారంభించారు. మారియో మిరాండా గౌరవార్థం ఒక స్మారక తపాలా బిళ్లను, ప్రత్యేక కవర్‌ను విడుదల చేయడంతో పాటు.. "గోవా ఇంజనీరింగ్ ది నెక్స్ట్ ఎరా" అనే కాఫీ టేబుల్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

గోవాకు చెందిన ప్రముఖ బ్రాండ్లకు, విశిష్ట వ్యక్తులకు ఉపరాష్ట్రపతి అవార్డులను ప్రదానం చేశారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. గోపాల్ రత్న అవార్డు పథకం, స్వయంపూర్ణ మిత్రులు, స్వయంపూర్ణ గ్రామాల అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. దీన్ దయాళ్ స్వస్థ్య సేవా యోజన కింద పెంచిన ఆరోగ్య బీమా సదుపాయాన్ని ప్రారంభించారు.

ఈ వేడుకల్లో గోవా గవర్నర్ శ్రీ పూసపాటి అశోక్ గజపతి రాజు, గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్, కేంద్ర విద్యుత్, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీ శ్రీపాద్ నాయక్, గోవా అసెంబ్లీ స్పీకర్ డాక్టర్ గణేష్ గాంకర్, రాజ్యసభ సభ్యులు శ్రీ సదానంద్ తానవాడే, గోవా ప్రభుత్వ మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఆత్మీయ పలకరింపు ఆర్థిక భరోసాలతో ఆనందహేళ..

**-తొలిపొద్దులోనే లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పంపిణీ..**
**-జిల్లాలో 2,25,887 మంది లబ్ధిదారులకు రూ. 99 కోట్ల పంపిణీ..**
**-సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి. డా.లక్ష్మీశ.**



విజయవాడ, జూన్ 1:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారుల జీవితాల్లో ఆర్థిక భరోసాను నింపుతున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సామాజిక భద్రతతో పాటు అధికారుల ఆత్మీయ పలకరింపులు లబ్ధిదారుల ముఖాల్లో ఆనందాన్ని తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు.

సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సోమవారం తెల్లవారుజామున విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్-2 పరిధిలోని మారుతీనగర్ 26వ స్వర్ణ వార్డులో జిల్లా కలెక్టర్ స్వయంగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా గుడిసేవ సుబ్బారావు, వసంతాల శ్రీనివాసరావు, బత్తుల కృష్ణారావులకు వృద్ధాప్య పింఛన్లు, కోమటి నాగమణికి వితంతు పింఛన్, బి. బాల మణికంఠ సాయి శ్రీనివాసుకు విభిన్న ప్రతిభావంతుల పింఛన్ అందజేశారు.

లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్, కొంతసేపు వారితో ముచ్చటించి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. వృద్ధులు, వితంతువులు, విభిన్న ప్రతిభావంతులు, డప్పు కళాకారులు, మత్స్యకారులు, ట్రాన్స్‌జెండర్లు, నిరుపేద కుటుంబాలకు సామాజిక భద్రతా పింఛన్లు ఆర్థిక అండగా నిలుస్తున్నాయని చెప్పారు.

ప్రతి నెల ఒకటో తేదీ వేకువజామునే స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందజేస్తుండటంతో వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని తెలిపారు.

జిల్లాలో మొత్తం 2,25,887 మంది లబ్ధిదారులకు రూ.99,01,45,500 పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇంటి వద్దకే పింఛన్లు అందించడం వల్ల లబ్ధిదారులు సౌకర్యవంతమైన సేవలు పొందుతున్నారని చెప్పారు.

క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పింఛన్ల పంపిణీ సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా, పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్ మొత్తాన్ని అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏ.ఎన్.వి. నాంచారరావు, వీఎంసీ జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ వృద్ధి తదుపరి దశ కోసం కార్యాచరణను నిర్దేశించిన జాతీయ ఖరీఫ్ సదస్సు

న్యూ ఢిల్లీ, జూన్ 1:భారత వ్యవసాయ రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టంగా తొలిసారి 22 రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు ఒకే వేదికపైకి వచ్చారు. దేశంలోని ప్రముఖ వ్యవసాయ పరిశోధనా కేంద్రాలలో ఒకటైన న్యూఢిల్లీ లోని పూసా ప్రాంగణంలో మే 28-29 తేదీలలో జరిగిన రెండు రోజుల జాతీయ ఖరీఫ్ సదస్సులో 22 రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు పాల్గొని సమన్వయ చర్యలు, సమర్థవంతమైన ఆచరణ ద్వారా రైతుల జీవితాలను మెరుగుపరచడానికి, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి ఉమ్మడి నిబద్ధతను ప్రకటించారు.

ఇది కేవలం ఒక సాధారణ సమీక్షా సమావేశం మాదిరి కాకుండా నిబద్ధత, సమన్వయం, క్షేత్రస్థాయి ఆచరణ కోసం ఒక జాతీయ వేదికగా ఆవిర్భవించింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన జరిగిన మొదటి రోజు సమావేశంలో రాష్ట్రాల వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఉన్నతాధికారుల మధ్య విస్తృతమైన చర్చలు జరిగాయి. రెండవ రోజు సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ మంత్రుల మధ్య సాయంత్రం వరకు కొనసాగిన సుదీర్ఘ చర్చలలో కూడా కేంద్ర మంత్రి శ్రీ చౌహాన్ స్వయంగా పాల్గొన్నారు. ఖరీఫ్ సంసిద్ధత, పప్పుధాన్యాలు, నూనెగింజలలో స్వయంసమృద్ధి, సమతుల్య ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, ప్రతిపాదిత 'ఖేత్ బచావో అభియాన్' ప్రచారంతో సహా కీలకమైన అంశాలపై వీరంతా కలిసి ఒక ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.

శ్రీ చౌహాన్ పిలుపు మేరకు ప్రకృతి వ్యవసాయానికి కేవలం విధానపరమైన స్థాయిలో మద్దతు ఇవ్వడమే కాకుండా, తమ స్వంత పొలాలలో కూడా దానిని అవలంబించి, ప్రయోగాలు చేస్తామని వ్యవసాయ మంత్రులు ముక్తకంఠంతో ప్రకటించడం ఈ సదస్సు ముఖ్యమైన ఫలితాలలో ఒకటిగా నిలిచింది. తామే ఆదర్శంగా నిలుస్తూ రైతులలో మరింత నమ్మకాన్ని పెంపొందించడం దీని ప్రధాన ఉద్దేశం.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో, భారత ప్రభుత్వం వ్యవసాయాన్ని కేవలం ఉత్పత్తి అంశంగా కాకుండా, నేల ఆరోగ్యం, పర్యావరణ స్థిరత్వం, పోషకాహార భద్రత, రైతుల సంపద, భవిష్యత్ తరాల సంక్షేమాన్ని కలిగిన సమగ్ర జాతీయ బాధ్యతగా పరిగణిస్తున్నట్టు జాతీయ ఖరీఫ్ సదస్సు మరోసారి స్పష్టం చేసింది. ప్రభుత్వ పథకాల నుంచి రైతులు మరింత సమర్థవంతంగా ప్రయోజనం పొందేలా పరిపాలనాపరమైన విధానాలను సరళీకృతం చేయాలని, అనవసరమైన సంక్లిష్టతలను తొలగించాలని శ్రీ చౌహాన్ ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

సదస్సు మొదటి రోజున దేశవ్యాప్తంగా ఉన్నతాధికారులు ఒకే చోటికి చేరి ఖరీఫ్ సీజన్ సంసిద్ధత, విత్తనాల లభ్యత, ఎరువుల నిర్వహణ, పంటల ప్రణాళిక, నీటి నిర్వహణ, ప్రాంతాల వారీగా ఎదురవుతున్న సవాళ్లపై చర్చించారు. కేంద్ర మంత్రి శ్రీ చౌహాన్ తన ప్రారంభ ఉపన్యాసం ముగిసిన తర్వాత కూడా ప్రతినిధుల మధ్య కూర్చుని చర్చలలో వారి అభిప్రాయాలను శ్రద్ధగా వినడం విశేషం. మరుసటి రోజు కూడా ఆయన అధ్యక్షతన రాష్ట్ర వ్యవసాయ మంత్రులు ఈ చర్చను ముందుకు తీసుకెళ్లి, దీనిని ఒక ఉమ్మడి విధానపరమైన కట్టుబాటుగా, కార్యాచరణ ప్రణాళికగా మార్చారు.

ముగింపు సమావేశంలో, అధికారులు, మంత్రులు ప్రదర్శించిన నిబద్ధతను, అంకితభావాన్ని, క్రియాశీల భాగస్వామ్యాన్ని శ్రీ చౌహాన్ అభినందించారు. ప్రతినిధుల నుంచి ఇంతటి కట్టుబాటుతో కూడిన భాగస్వామ్యాన్ని తాను చాలా అరుదుగా చూశానని ఆయన పేర్కొన్నారు. హాజరైన వారు తమను కేవలం పాలకు లగానే కాకుండా ఆలోచనా పరులుగా, ఆచరణ కర్తలుగా, మార్పునకు వారధులుగా ప్రదర్శించుకున్న తీరు ఈ సదస్సు స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ సదస్సు ద్వారా వెలువడిన అత్యంత బలమైన సందేశం బహుశా "వ్యవసాయాన్ని రక్షించడం అంటే భవిష్యత్తును రక్షించడమే". పంట పొలాలను రక్షించడం అనేది కేవలం వ్యవసాయ భూములను కాపాడటం మాత్రమే కాదని, పర్యావరణాన్ని, దేశాన్ని, రాబోయే తరాల భవిష్యత్తును కూడా సంరక్షించడమని శ్రీ చౌహాన్ స్పష్టం చేశారు. ఎరువుల సమతుల్య వినియోగం ఆవశ్యకతపై సదస్సు ప్రత్యేక దృష్టి సారించడం గమనార్హం.

రసాయన ఎరువులను పూరిగా నిషేధించడం తమ ఉద్దేశం కాదని, వాటి శాస్త్రీయ, సమతుల్య, విచక్షణాయుతమైన వినియోగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. దీనిని సాధించేందుకు దేశవ్యాప్తంగా విస్తృత అవగాహన ఉద్యమం, సంస్థాగత ప్రచారాన్ని చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఇందుకనుగుణంగా "ఖేత్ బచావో అభియాన్" ను కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్), కృషి విజ్ఞాన కేంద్రాలు, విస్తృత శాస్త్రీయ సమాజం కలిసి సంయుక్త జాతీయ కార్యక్రమంగా అభివృద్ధి చేయాలని సదస్సు ప్రతిపాదించింది.

ఈ ప్రచారం కేవలం ఒక పిలుపుగానే మిగిలిపోకుండా, క్షేత్రస్థాయిలో ప్రయోజనకరమైన ఫలితాలను అందించేలా చూడటం కోసం సమన్వయ ఆచరణ విధానాలు, పర్యవేక్షణ వ్యవస్థలు, ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని కూడా శ్రీ చౌహాన్ ప్రముఖంగా పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యవసాయ మంత్రులు ఈ సదస్సులో తమ సొంత పొలాలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వ్యక్తిగతంగా అవలంబిస్తామని బహిరంగంగా కట్టుబాటును ప్రకటించడం మరో విశేషం. చాలా మంది వ్యవసాయ మంత్రులకు స్వయంగా వ్యవసాయంతో అనుబంధం ఉండటం వల్ల, ఈ నిర్ణయం కేవలం ప్రతీకాత్మకంగా కాకుండా ఆచరణాత్మక ప్రాధాన్యతను సంతరించుకుంది. విధాన రూపకర్తలు, ప్రజాప్రతినిధులు స్వయంగా చిన్న స్థాయిలోనైనా ప్రకృతి వ్యవసాయ నమూనాలను ప్రదర్శించినప్పుడు, ఆ సందేశం రైతులకు మరింత నమ్మశక్యంగా, స్ఫూర్తిదాయకంగా మారుతుందని శ్రీ చౌహాన్ అన్నారు.

ఈ విషయంలో గుజరాత్ వంటి రాష్ట్రాల అనుభవాలను విలువైన ఉదాహరణలుగా ప్రముఖంగా ప్రస్తావించారు. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ కూడా ఈ సదస్సులో క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఒక ప్రత్యేక సెషన్‌లో దేశవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల విస్తరణను గట్టిగా సమర్థించారు.

ఈ సదస్సు ద్వారా ఖరీఫ్ ప్రణాళిక అనేది ఇకపై కేవలం ఆయా సీజన్ల సంసిద్ధతకే పరిమితం కాదని స్పష్టమైంది. బదులుగా, దీనిని పప్పుధాన్యాలు, నూనెగింజలలో స్వయం సమృద్ధి, నేల ఆరోగ్యం, పెట్టుబడి వ్యయాల విచక్షణాయుత నిర్వహణ, వ్యవసాయ ఉత్పాదకత నిరంతర పెంపుదలతో కూడిన ఒక విస్తృతమైన ఎజెండాతో అనుసంధానిస్తారు. ఈ నూతన విధాన దృష్టికోణం ఉత్పత్తిని పెంచడంతో పాటు సహజ వనరుల ఆరోగ్యాన్ని కాపాడటం, పునరుద్ధరించడం రెండింటినీ ఏకకాలంలో సాధించాలనే లక్ష్యాన్ని కలిగిఉంది.

విధానపరమైన నిర్ణయాలను ప్రజా ఉద్యమాలుగా మార్చడానికి అవసరమైన సమాచార ప్రసార వ్యూహం ఈ చర్చలోని మరొక ముఖ్యమైన అంశం. శ్రీ చౌహాన్ తన ముగింపు ఉపన్యాసంలో, ఈ సదస్సులో ఖరారు చేసిన నిర్ణయాలు, ప్రచార కార్యక్రమాలను వివిధ అవగాహన, ప్రచార వేదికల ద్వారా రైతులకు, ప్రజలకు నిరంతరం చేరవేయాలని అన్నారు. ఇలాంటి ప్రయత్నాలు వ్యవసాయ సంస్కరణలను కేవలం పరిపాలనా కార్యక్రమాలుగా కాకుండా, ప్రజల భాగస్వామ్యంతో నడిచే ప్రజాకేంద్రిత ఉద్యమాలుగా మారుస్తాయని ఆయన తెలిపారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగ నిర్వహణను కేవలం పథకాల ప్రకటనలకే పరిమితం చేయకుండా ఉమ్మడి బాధ్యతా సంస్కృతిని పెంపొందించాలని ఆకాంక్షిస్తోందని శ్రీ చౌహాన్ పేర్కొన్నారు. గొప్ప లక్ష్యాలను సాధించడానికి గొప్ప హోదా అవసరం లేదని, గొప్ప సంకల్పం ఉంటే సరిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ భావనే ఈ సదస్సు ప్రధాన స్ఫూర్తిగా నిలిచింది, మంత్రులు, అధికారులు తమ బాధ్యతలను అంకితభావంతో, స్పష్టమైన ఉద్దేశంతో నెరవేర్చడానికి సమిష్టిగా కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారు.

వ్యవసాయాన్ని కేవలం ఒక శాఖాపరమైన అంశంగా కాకుండా జాతీయ మిషన్ స్థాయికి తీసుకెళ్లిన రెండు రోజుల జాతీయ ఖరీఫ్ సదస్సు ఒక చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తోంది. 'ఖేత్ బచావో అభియాన్', సమతుల్య ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయానికి ఆచరణాత్మక నమూనాలు, పప్పు ధాన్యాలు, నూనె గింజలలో స్వయంసమృద్ధి లక్ష్యాలు ఇకపై నిర్దిష్ట కాలపరిమితులు, అమలు చర్యలతో ముందుకు సాగనున్నాయి. ఈ సదస్సు వ్యవసాయ రంగానికి ఒక కీలకమైన, సానుకూల మలుపుగా నిలుస్తుందని భావిస్తున్నారు.

సదస్సు ముగింపు సందర్భంగా శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ రెండు రోజుల సుదీర్ఘ చర్చల నుంచి వెలువడిన ఆలోచనలు, కట్టుబాట్లను క్షేత్రస్థాయిలో ఆచరణలోకి తీసుకువచ్చేలా ప్రతినిధులతో సమిష్టి ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ ఖరీఫ్ సదస్సు 2026 ఆలోచనల నుంచి కట్టుబాటు వైపు, కట్టుబాటు నుంచి ఆచరణ వైపు సాగే మార్పు దిశగా అత్యంత ముఖ్యమైన విజయంగానూ, కార్యాచరణ వైపు నిర్ణయాత్మకంగా అడుగులు వేస్తున్న భారత వ్యవసాయ రంగ మార్పునకు సంకేతంగానూ నిలుస్తోంది.

### లోన్ యాప్ వేధింపుల కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత

అమరావతి, జూన్ 1: యాప్ వేధింపుల కారణంగా మరో యువకుడు మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల కేంద్రంలో విషాదాన్ని నింపింది.

మండల కేంద్రానికి చెందిన అక్కినపల్లి లిఖిత్ (21) అనే యువకుడు లోన్ యాప్ ద్వారా అప్పు తీసుకున్నట్లు సమాచారం. అనంతరం రుణ వసూళ్ల పేరుతో వేధింపులు అధికం కావడంతో కొద్ది రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ సోమవారం లిఖిత్ మృతి చెందినట్లు తెలిసింది.

నేటి కందం-నేటికి అందం

ప్రాణమ్ముల నొడ్డి తెలం
గాణను సాధించు కొనిన కమ్మని దినమున్
రాణించెడి పద్ధతిలో
మానితముగ జరుప వలయు మన మందరమున్ !!

(12వ తెలంగాణా ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com  ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433  E-mail:netinijam93@gmail.com

అధికారంలుండగా
అస్తిత్వం నాస్తి
దిగిపోగనే నినాదంగా
దిగంతాల జాస్తి.
దశాబ్దపు గత పాలన
దాచుంచిన దస్త్రం
తెలంగాణ సెంటిమెంట్
తిరిగి అవునా అస్త్రం

చురక

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 2-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:232 పేజీలు:6 వెల: రూ.1/-


# వర్షాభావంపై రైతులకు అవగాహన కల్పించాలి: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, జూన్ 1: వర్షాకాల సన్నద్ధతపై ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సెక్రటేరియట్‌లో సమీక్ష జరిగింది. నైరుతి రుతుపవనాలతో వచ్చే వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, ఇతర అంశాలపై వాతావరణ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సీఎం సూచించారు. తక్కువ నీరు వినియోగించుకునే పంటలపై రైతులకు వివరించాలన్నారు. పంట మార్పిడి ప్రాధాన్యాన్ని అన్నదాతలకు తెలియజేయాలని సీఎం ఆదేశించారు.

ప్రాజెక్టుల మెయింటెనెన్స్ పనులపై ఆరా

తెలంగాణలో ప్రాజెక్టుల మెయింటెనెన్స్ పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. గేట్లు, నిర్వహణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల మెయింటెనెన్స్‌కు అవసరమైన నిధులు తక్షణవే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000కోట్లను నిబంధనల ప్రకారం వినియోగించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణవే అధికారులు స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఆరోగ్య, హోమ్, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇక టీవీకే, డీఎంకే మధ్యనే పోరు.. అన్నాడీఎంకేకు చోటుండదు : తమిళనాడు సీఎం విజయ్



తమిళనాడు, జూన్ 1: తమిళనాడు లో రాజకీయ పోరు ఇకపై టీవీకే , డీఎంకే మధ్య మాత్రమేనని, అన్నాడీఎంకే కు చోటుండదని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ అన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత సోమవారం తొలిసారిగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కుటుంబ రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడారని వ్యాఖ్యానించారు. తన పాలన ప్రజలందరి కోసం ఉంటుందని, రాష్ట్ర హక్కులు, లౌకికవాదం విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడబోమని అన్నారు.

'రాజకీయంగా చెబుతున్నా. ఇప్పుడు పోటీ కేవలం రెండు పార్టీల మధ్యే. ఒకటి డీఎంకే, మరొకటి టీవీకే. మధ్యలో ఇంకెవరికీ పాత్ర లేదు' అని విజయ్ చెప్పారు. తమ పార్టీపై వస్తున్న హార్స్ ట్రేడింగ్ ఆరోపణలను ఖండించిన విజయ్.. అధికారం కోల్పోయిన డీఎంకే, అన్నాడీఎంకేలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 'ఇన్నేళ్లుగా మిమ్మల్ని మోసం చేస్తున్న వారిని కాదని, మీ కోసం పనిచేయడానికి వచ్చిన మీ విజయ్‌ని, మీ అన్నని, మీ తమ్ముడిని ముఖ్యమంత్రిగా కాదు, మీ మొదటి సేవకుడిగా ఎన్నుకున్నారు' అని వ్యాఖ్యానించారు.

తాను అధికారంలోకి వచ్చి కొద్ది వారాలే అయినా.. ఆరు నెలలు మౌనంగా ఉంటామని చెప్పిన వాళ్ల ఆరు రోజులు కూడా ఆగలేకపోయారని విమర్శించారు. చివరగా తాను సూట్ ధరించడంపై వస్తున్న విమర్శలపై స్పందిస్తూ.. సూట్ ఎందుకు వేసుకోకూడదని విజయ్ ప్రశ్నించారు.

# 99 శాతం మందికి నేను ఉద్యోగాలు ఇవ్వలేను

## - టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం



హైదరాబాద్, జూన్ 1:ఎంత ప్రయత్నం చేసినా అందరికీ ఉద్యోగం ఇవ్వడం సాధ్యం కాదని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. నోటిఫికేషన్ల గురించి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మా జాబ్ ఎలాంటిదంటే.. ఎవరు కూడా కావాలని కోరుకోని పరిస్థితిలో మేముంటాం. టీజీపీఎస్సీ నుంచి పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు అసిస్టెంట్ సైంటిస్ట్‌కు నోటిఫికేషన్ ఇచ్చాం. దాదాపు 19 వేల దరఖాస్తులు వచ్చాయి. ఉన్న పోస్టులు మాత్రం 20. అంటే నేను ఏం చేసినా కూడా 0.1 శాతం నిరుద్యోగులకు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వగలను. అంటే 99.9%మందికి నేను ఉద్యోగం ఇవ్వలేను. వారికి ఉద్యోగం ఇవ్వకపోతే వాళ్లు మన గురించి మంచి మాట్లాడుతరని చెప్పుకోవడం కష్టమన్నారు. అసంతృప్తి అనేది సహజంగానే ఉంటుంది. అది అవసరమైందా..అనవసరమైందా..? మీడియా కూడా గమనించాలి. అకారణంగా మాట్లాడేవాళ్లను కంట్రోల్ చేసే ప్రయత్నం మీడియా కానీ సమాజం కానీ చేయాలి. ఎందుకంటే అందరికీ ఉద్యోగం ఇవ్వడమనేది ఈ నోటిఫికేషన్ అయినా.. ఏ నోటిఫికేషన్ అయినా సాధ్యం కాదు. ఉన్న పోస్టులు 20 కాబట్టి ఎన్ని ప్రయత్నాలు చేసినా చివరి 20మందికే ఉద్యోగాలు ఇవ్వాలి. కొన్ని అపోహలు, అసత్యాలు కానీ బయట ప్రచారం చేసేవాళ్లుంటారు. దాన్ని సమాజం కానీ, మీడియా కానీ సీరియస్‌గా తీసుకోకూడదు.. ఎవరేం చెప్పినా అదే నిజమని నమ్మితే.. మన పిల్లలకు మనవే అన్యాయం చేస్తున్నమన్నారు. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తాం.. రెండు లక్షల ఉద్యోగాలిస్తామని హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో టీజీపీ ఎస్సీ చైర్మన్ చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి.

# పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పడంలో భారత్ కీలకపాత్ర పోషించాలి : ఇజ్రాయెల్

న్యూఢిల్లీ, జూన్ 1: భౌగోళిక ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో పశ్చిమాసియా (చివబబిఒబతిజీ) ప్రాంతంలో శాంతి భద్రతలను నెలకొల్పడానికి భారత్ అత్యంత కీలకమైన పాత్ర పోషించాల్సి ఉందని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ అభిప్రాయపడ్డారు. వేగంగా ఎదుగుతున్న ఆర్థిక శక్తిగా, బలమైన వాణిజ్య భాగస్వామిగా భారత్ ఈ ప్రాంత ముఖచిత్రాన్ని మార్చేయగలదని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రపంచంలోని అన్ని ప్రధాన వాణిజ్య కూటములతో భారత్ చారిత్రాత్మక ఒప్పందాలను కుదుర్చుకుందని రూవెన్ అజర్ గుర్తుచేశారు.

పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని నెలకొల్పి, తీవ్రవాద శక్తులను అణచివేయగలిగితే.. భారత్ ద్వారా వచ్చే ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు, వస్తు రవాణావల్ల ఇక్కడి దేశాలన్నీ అద్భుతమైన సంపదను, శ్రేయస్సును అనుభవిస్తాయని రూవెన్ అజర్ అభిప్రాయపడ్డారు. అందుకే ఈ ప్రాంత స్థిరత్వంలో ఢిల్లీ పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ఇదే సమయంలో ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన దౌత్య బంధాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు.

ప్రపంచవ్యాప్తంగా ఇజ్రాయెల్‌పై విమర్శలు వస్తున్నప్పటికీ.. భారత్ నుంచి మాత్రం తమకు అచంచలమైన ప్రజా మద్దతు లభిస్తోందని చెప్పారు. భారత్‌లో ఇజ్రాయెల్ పట్ల ఒక అద్భుతమైన క్రేజీ లవ్ ఉందని, ప్రపంచంలో మరే దేశం నుంచి లేనంత మంది ఫాలోవర్లు నాకు ఒక్క భారతదేశం నుంచే ఉన్నారని నెతన్యాహు సంతోషం వ్యక్తంచేశారు.

# పార్టీయే సుప్రీం.. కార్యకర్తే నాయకుడు: సీఎం చంద్రబాబు

అమరావతి, జూన్ 1: 'పార్టీయే సుప్రీం.. కార్యకర్తే నాయకుడు' అనే సిద్ధాంతంతో ప్రతి ఒక్కరూ సైనికుడిలా పనిచేయాలని.. టీడీపీ శ్రేణులకు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. తునిలో నిర్వహించిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి వరుస విజయాలు సాధించేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాల ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు.

ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి, ఉచిత విద్యుత్ అందించడం ద్వారా కరెంటు బిల్లుల భారాన్ని తగ్గిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. అలాగే రైతులకు ఉచిత వ్యవసాయ పంపుసెట్లు, యూనివర్సల్ హెల్త్ స్కీమ్ కింద రూ.2.5 లక్షల వరకూ ఉచిత వైద్యం వంటి పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. గ్రామ, క్లస్టర్ స్థాయి సమావేశాల్లో మహిళల భాగస్వామ్యాన్ని భారీగా పెంచాలని పేర్కొన్నారు. పార్టీని నమ్ముకుని పనిచేసే కార్యకర్తలు ఆర్థికంగా ఎదిగేలా చేయడం తమ నైతిక బాధ్యత అని చంద్రబాబు చెప్పారు.

జూన్ 21న రాష్ట్రవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, అనంతరం జూన్ 25 నుంచి నాయకులు, కార్యకర్తలు పర్యావరణ హితంగా సైకిళ్లపై ఇంటింటి ప్రచారం చేపట్టాలని సూచించారు. గత ఎన్నికల్లో సాధించిన 55.5 శాతం ఓట్ల కంటే మరింత ఎక్కువ ప్రజా మద్దతు సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మన డిక్షనరీలో ఓటమి అనే మాట ఉండకూడదని.. ప్రతి కార్యకర్త ఏకపక్షంగా గెలుపు సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు.

# మళ్లీ పెరిగిన కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర.. ఐదు నెలల్లోనే డబుల్ రేట్!

న్యూఢిల్లీ, జూన్ 1:కేంద్రం మరోసారి షాకిచ్చింది. హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సంస్థలు వంటి వాణిజ్య అవసరాలకు ఉపయోగించే కమర్షియల్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధరలను మరోసారి పెంచాయి. 19 కిలోల కమర్షియల్ గ్యాస్ సిలిండర్‌పై రూ.42 రూపాయల వరకు పెంచినట్లుగా చమురు సంస్థలు వెల్లడించాయి. దీంతో ఢిల్లీలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3113.50కు చేరింది. పెరిగిన ధరలు జూన్ 1వ తేదీ నుంచే అమలులోకి వచ్చాయి.

అదే కోల్‌కతాలో ఈ పెంపు రూ.53.50గా ఉంది. అక్కడ గ్యాస్ సిలిండర్ ధర రూ.3 255.50కు చేరుకుంది. తాజా పెంపుతో హైదరాబాద్‌లో వాణిజ్య సిలిండర్ ధర రూ.32 94కు చేరింది. ఇక చెన్నైలో రూ.3232, పట్నాలో 3322గా ఉంది. ఉవనీణతీజీజూఫ్తతిఇ ఖీవటవతీవనిఇవ

అలాగే ఐదు కేజీల ఫ్రీట్రేడ్ ఎల్పీజీ సిలిండర్లపై రూ.11 చొప్పున పెంచారు. దీంతో ఢిల్లీలో దీని ధర రూ.821.50 కు చేరుకుంది. గృహ వినియోగానికి ఉపయోగించే 14.2 కిలోల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధరలో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు. ఢిల్లీలో ప్రస్తుతం డొమెస్టిక్ సిలిండర్ ధర రూ.913గానే ఉంది.

ఐదు నెలల్లో డబుల్

ఈ ఏడాది ప్రారంభం నుంచే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో 19 కిలోల సిలిండర్ ధర రూ.1691.50గా ఉండగా.. ప్రస్తుతం అది 3113.50కు చేరింది. అంటే కేవలం ఐదు నెలల్లోనే ధర దాదాపు రెట్టింపయ్యింది. ఇరాన్‌తో ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం మొదలైన తర్వాత తొలిసారిగా ఫిబ్రవరిలో రూ.49 పెంచారు. అనంతరం మార్చిలో రూ.115 పెంచగా.. ఏప్రిల్‌లో ఒకేసారి రూ.993 పెంచి వ్యాపారస్తులకు భారీ షాకిచ్చారు.

# అన్నదాతకు అండగా ప్రభుత్వం..

# చివరి గింజ వరకూ కొంటాం: మంత్రి ఉత్తమ్



సూర్యాపేట, జూన్ 01: వరి ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, ధాన్యం కొనుగోళ్ల ప్రగతిని వివరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా.. రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా ఇప్పటివరకు సుమారు 64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విజయవంతంగా సేకరించామని మంత్రి తెలిపారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని సైతం రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో, ప్రభుత్వం మద్దతు ధరకే కొనుగోలు చేసిందని ఆయన స్పష్టం చేశారు. చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

యాసంగిలో మొత్తం భారతదేశం నుంచి కేంద్రానికి అందిన ధాన్యంలో 63 శాతం వాటా ఒక్క తెలంగాణ రాష్ట్రం నుంచే వెళ్లడం మన రైతుల కష్టానికి, ప్రభుత్వ సహకారానికి నిదర్శనమని మంత్రి ఉత్తమ్ కొనియాడారు. అలాగే, గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం అమ్మిన రైతులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా, కేవలం 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, రాబోయే జూన్ 4వ తేదీ లోపు కొనుగోళ్లన్నింటినీ పూర్తిగా ముగించాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో విఫలం: రాంచందర్‌రావు

న్యూఢిల్లీ, జూన్ 1:ంవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రైస్ మిల్లర్లతో కుమ్మక్కైందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు (ఖీజీఎఇష్ట్రజీనిటతీజీ ఖీజీనీ) విమర్శించారు. చివరి గింజ వరకు ధాన్యం కొంటానని సీఎం చెప్పారని.. మరి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వడ్లను కేంద్రం ఎప్పుడు కొనదని.. ఆయా రాష్ట్రాలు కొన్న దానికి మాత్రవే రీయింబర్స్‌మెంట్ చేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం వల్లే తెలంగాణలో ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. ధాన్యం రోడ్లపై కుప్పలు కుప్పలుగా పడి ఉందని అన్నారు. బీజేపీ ఆందోళనతో రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చిందని తెలిపారు. ఈరోజు (సోమవారం) ఢిల్లీ వేదికగా రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు.

ధాన్యం కొనుగోళ్లు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని రాంచందర్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎంత పంట పడిందనే సమాచారం కేంద్రానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రైతుల వద్ద ఉన్న పంటను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర పోవడంతోనే ధాన్యం కొనుగోళ్ల సమస్యలు వచ్చాయని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ పోరాటంతోనే ఆయా కొనుగోలు కేంద్రాలకు లారీలను రేవంత్ ప్రభుత్వం పంపుతోందని చెప్పారు. తెలంగాణ నుంచి కేంద్ర కమిటీలోకి ఎవరు వెళ్తారనే విషయంపై కేంద్ర హైకమాండ్ ఓ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

ఢిల్లీలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తాం..

రేపు ఢిల్లీలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తామని రాంచందర్‌రావు తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా బీజేపీ జాతీయ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు. తెలంగాణ, కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే దిశగా తమ పార్టీ జాతీయ నాయకత్వం కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణపై బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టి సారించిందని అన్నారు. బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై పెట్టిన పోస్టర్లకు.. పార్టీలో గ్రూప్ తగాదాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీజేపీలో అంతర్గత కలహాలు సృష్టించాలనే ఈటలపై ఎవరో పోస్టర్లు పెట్టారని మండిపడ్డారు. పోస్టర్లు పెట్టిన వారిపై పార్టీపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ విషయంపై డీజీపీ, కమిషనర్‌కి ఫిర్యాదు చేశామని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

# తెలంగాణలో పవన్ కళ్యాణ్ సభ పెట్టుకోవచ్చు: యెన్నం శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, జూన్01: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై 12 ఏళ్లు అయిన తర్వాత తెలుగు రాష్ట్రాల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతోందంటూ బీఆర్ఎస్ పార్టీపై ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. జనసేన పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. తెలంగాణలో సభ పెట్టుకోవచ్చున్నారు. అయితే తెలంగాణను కించపరిస్తే మాత్రం ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో మీడియాతం యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మొన్నటి వరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌తో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. చెట్టాపట్టాలు వేసుకున్నారని గుర్తు చేశారు. అలాంటి కేసీఆర్ ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్ వ్యతిరేకులను ఓడించేందుకు కేసీఆర్ అన్ని విధాల సహాయం చేశారని ఆరోపించారు.

గత ఎన్నికల్లో తెలంగాణలో కూటమి పోటీ చేసిందని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో కూటమి వచ్చినా ఇంకెవరు వచ్చినా తెలంగాణలో వచ్చేది తమ ప్రభుత్వమే అని ఆయన జోస్యం చెప్పారు. ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేయలేదా? అంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ కుమారుడు కేటీఆర్‌కు ఎన్టీఆర్ పేరు పెట్టారని గుర్తు చేశారు. అలాంటి వాళ్లు ఇప్పుడు రాజకీయం చేస్తున్నారని బీఆర్ఎస్ నేతల తీరును ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఎండగట్టారు.

# 'ముస్లింల సమస్యల పరిష్కారానికి బీసీ కమిషన్ హామీ'

## –బీసీ–ఈ, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణల అంశంపై యాకూబ్ పాషా వినతి

ఖమ్మం, జూన్ 1:ముస్లింలకు సంబంధించిన బీసీ–ఈ, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో రాష్ట్రంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా బీసీ కమిషన్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి పలు అంశాలపై వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో బీసీ–ఈ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీ విషయంలో తలెత్తుతున్న ఇబ్బందులను కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని విద్య, ఉపాధి అవకాశాలను పొందేందుకు అర్హులైన ముస్లింలకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు పొందేందుకు సరైన మార్గదర్శకాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా విద్యాశాఖ రూపొందించిన ఐఎస్ఎంఎస్ పోర్టల్‌లో ముస్లిం విద్యార్థుల వివరాలలో మహమ్మద్ ఇంటి పేరు గల విద్యార్థుల నమోదుకు సంబంధించిన అంశాలను కూడా ప్రస్తావించి భవిష్యత్తులో ముస్లిం రిజర్వేషన్ల ప్రయోజనాలు అందరికీ సమానంగా చేరేలా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయాలపై స్పందించిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిశీలించి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు యాకూబ్ పాషా తెలిపారు.

# కేరళలో మాదకద్రవ్యాల నిరోధక చర్యలను ముమ్మరం చేసిన డీఆర్ఐ...

## 24 కిలోల మాదకద్రవ్యాలు స్వాధీనం.. అయిదుగురు అరెస్టు

న్యూఢిల్లీ, జూన్ 1:డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) కొచ్చిన్ యూనిట్ నిర్వహించిన ఆపరేషన్ చక్రవ్యూహ అనే ప్రత్యేక మత్తుపదార్థాల వ్యతిరేక ఆపరేషన్‌లో భారీ ఎత్తున డ్రగ్స్ పట్టుబడ్డాయి. కొచ్చి, మలప్పురం, తిరువనంతపురం ప్రాంతాల్లో అక్రమ రవాణా, పంపిణీ కోసం సిద్ధంగా ఉంచిన మెథాక్వాలోన్, మెథాంఫెటమిన్, హాషీష్ ఆయిల్ వంటి మాదకద్రవ్యాలను, సైకోట్రోపిక్ పదార్థాలను భారీ సంఖ్యలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ దాడిలో మొత్తం 24 కేజీలకు పైగా మత్తుపదార్థాలు, సైకోట్రోపిక్ పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్స్ రవాణా వ్యవస్థలో అత్యంత కీలకమైన వ్యక్తులతో పాటు మొత్తం అయిదుగురు నిందితులను నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం (మత్తుపదార్థాలు, మానసిక స్థితిపై ప్రభావం చూపే పదార్థాల నిరోధక చట్టం-ఎన్‌డీపీఎస్) 1985 నిబంధనల ప్రకారం అదుపులోకి తీసుకున్నారు.

ఈ మత్తుపదార్థాలను విమానాశ్రయంలో ప్రయాణికుల సామాను ద్వారా, కొరియర్ పార్సళ్లలో రహస్యంగా దాచడం, విదేశాలకు ఎగుమతి చేసే సరుకు రవాణా సహా వివిధ మార్గాల్లో అక్రమంగా తరలించడానికి ప్రయత్నిస్తుండగా అధికారులు గుర్తించి పట్టుకున్నారు.

ఈ డ్రగ్స్ పట్టివేత అనేది అంతర్జాతీయ, దేశీయ మార్గాల ద్వారా సాగుతున్న వ్యవస్థీకృత మాదకద్రవ్యాల అక్రమ రవాణా వ్యవస్థలను పూర్తిగా నిర్మూలించడానికి డీఆర్ఐ నిరంతర అప్రమత్తను, ప్రత్యేక ప్రయత్నాలను స్పష్టం చేస్తోంది.

గత ఆర్థిక సంవత్సరంలో డీఆర్ఐ కొచ్చిన్ జోనల్ యూనిట్ కేరళ వ్యాప్తంగా సుమారు 70.76 కోట్ల రూపాయల విలువైన మత్తుపదార్థాలను, సైకోట్రోపిక్ పదార్థాలను స్వాధీనం చేసుకుంది. వివిధ ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి మొత్తం 21 మందిని అరెస్ట్ చేసింది.

మత్తుపదార్థాల ముప్పు నుంచి సమాజాన్ని రక్షించడానికి, భారత ప్రభుత్వం నిర్దేశించుకున్న 'నషా ముక్త భారత్' (మత్తుపదార్థాలు లేని భారత్) లక్ష్యాన్ని సాధించడంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ ఎల్లప్పుడూ అంకిత భావంతో, దృఢ నిశ్చయంతో ముందుకు సాగుతోంది.

# చలివేంద్రం వెనుక సేవా స్ఫూర్తి

అమరావతి, జూన్ 1: మండుటెండల నేపథ్యంలో ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం విస్తృత చర్యలు చేపడుతోందని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు.

స్థానిక 64వ డివిజన్ కండ్రికలో టీడీపీ కార్యాలయం వద్ద డివిజన్ అధ్యక్షుడు కె. రవికుమార్ ఆధ్వర్యంలో వేసవి కాలంలో ప్రయాణికులు, బాటసారుల కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎండ కాలం తీవ్రంగా కొనసాగుతోందని, ముఖ్యంగా విజయవాడ నగరంలో మండుటెండలు, వడగాలులు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం దెబ్బతినకుండా ఉండేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందన్నారు.

గత 22 రోజులుగా నిరంతరంగా చలివేంద్రం నిర్వహిస్తూ ప్రజలకు మజ్జిగ పంపిణీ చేస్తున్న డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కె. రవికుమార్, ఆయన బృందం చేస్తున్న సేవలను ఎమ్మెల్యే అభినందించారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు కాకోల్లు హర్షసాయి, ప్రధాన కార్యదర్శి ఎస్.కే. బాబు, యూనిట్ ఇన్‌చార్జి కోమరి రాజేష్, అడప సాయి, కంకణాల బాబు, తెల్ల భవాని, పొట్నూరి అప్పలనాయుడు, బలుగూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మందపాకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మికంగా పరిశీలించిన ఎమ్మెల్యే



అమరావతి, జూన్ 1:మండల పరిధిలోని మందపాకల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సోమవారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకుని, రోగుల పరిస్థితిని ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఓపీ విభాగాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితిపై సమాచారం సేకరించారు.

ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలు, ప్రసూతి సేవలు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారిణి డాక్టర్ కే. శిరీష ఎమ్మెల్యేకు వివరించారు. కుక్కకాటు, పాముకాటు చికిత్సలకు అవసరమైన ఇంజెక్షన్లు, ఇతర మందులు కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

అయితే ఒక వైద్యాధికారి పోస్టు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు, ఎఫ్ఎన్ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరాన్ని వివరించారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రి ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ వైద్య సిబ్బందికి సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎం.పీ.హెచ్.ఈ.ఓ వీవీ సుబ్బారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్ వైఫల్యాలను ప్రజలు మరిచిపోలేరు సంక్షేమం..

## ఉద్యోగాల్లో చంద్రబాబు ప్రభుత్వం ఆదర్శంఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ



విజయవాడ,జూన్ 1:వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్లక్ష్యం, వైఫల్యాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, ఉద్యోగాల కల్పనలో ఆదర్శంగా నిలుస్తోందని ఆమె పేర్కొన్నారు.

సోమవారం కూటమి 5వ డివిజన్ క్రీస్తురాజపురం ప్రాథమిక కేంద్రం పరిధిలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో గద్దె అనురాధ పాల్గొన్నారు. లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి నెల నుంచే సామాజిక పింఛన్లను పెంచి ఎన్నికల హామీని నిలబెట్టుకుందని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన లబ్ధిదారులకు గౌరవప్రదమైన పింఛన్లు అందిస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని అన్నారు.

జగన్ పాలనలో ఐదేళ్ల పాటు దివ్యాంగుల పింఛన్ల పెంపుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచి వారి పట్ల బాధ్యతను చాటిందని పేర్కొన్నారు.

ఉద్యోగాల భర్తీ విషయంలో కూడా గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గద్దె అనురాధ ఆరోపించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేదని, ఇప్పుడు డీఎస్సీ అభ్యర్థుల ప్రతిభను కించపరిచేలా తప్పుడు ప్రచారం చేయడం బాధాకరమని అన్నారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి వేలాది కుటుంబాల్లో ఆనందం నింపిందని తెలిపారు. ప్రతిభ ఆధారంగా, పూర్తి పారదర్శకతతో నిర్వహించిన డీఎస్సీ ద్వారా అర్హులైన అభ్యర్థులకు ఉద్యోగాలు లభించాయని చెప్పారు.

ప్రజలకు సంక్షేమం అందించడం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రతి వర్గం అభ్యున్నతికి కృషి చేయడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గద్దె అనురాధ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే వైఎస్సార్సీపీ నేతలు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బచ్చులకూర అజయ్, నందిపాటి దేవానంద్, చలసాని రమణ, దోమకొండ రవి, బోరుగడ్డ ప్రసాద్, రెమ్మనపూడి బ్రహ్మేశ్వరరావు, కట్టేవరపు శ్యామ్, షేక్ హనీఫ్, పి. వెంకట్రావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి ప్రాణాలకు అండగా ప్రభుత్వ చేయూత

అమరావతి, జూన్ 1: ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో అందించిన వినతిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం, ఓ చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు భారీ ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. చాగలమర్రి మండలానికి చెందిన లక్ష్మి ధన్సికకు అవసరమైన బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ (స్టెమ్ సెల్ థెరపీ) చికిత్స కోసం రూ.22 లక్షల ఆర్థిక సహాయం అందించింది.

సోమవారం పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయ ఉత్తర్వులను చిన్నారి తల్లిదండ్రులకు అందజేశారు.

కలెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం, లక్ష్మి ధన్సికకు అత్యవసరంగా బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సి ఉండగా, చికిత్సకు సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. అంతటి వ్యయాన్ని భరించే ఆర్థిక స్థోమత తమకు లేదని చిన్నారి తల్లిదండ్రులు గతంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు.

ఈ అంశంపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్, చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కుటుంబ ఆర్థిక స్థితిగతులను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ప్రత్యేక చొరవతో ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి రూ.22 లక్షల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిని సానుకూలంగా పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. చిన్నారి ఆరోగ్యంగా కోలుకుని మంచి భవిష్యత్తుతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

శస్త్రచికిత్సలో భాగంగా అవసరమైన బోన్ మ్యారో కణాలను చిన్నారి తండ్రి నుంచి సేకరిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

చిన్నారి తల్లిదండ్రులు మాట్లాడుతూ, తమ కుమార్తె ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి, సమస్యను గుర్తించి సహకరించిన జిల్లా కలెక్టర్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆర్థిక సహాయం తమ కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు.

ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో సమర్పించిన అర్జీకి సత్వర స్పందన లభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి




ఏలూరు జూన్ 1:: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించి భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పిలుపునిచ్చారు.

ప్రపంచ పర్యావరణ వారోత్సవాల సందర్భంగా సోమవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో "పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత - మన భవిష్యత్తు" అనే సందేశంతో రూపొందించిన పోస్టర్లు, జ్యూట్ బ్యాగులు, క్లాత్ బ్యాగులను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. పర్యావరణానికి హాని కలిగించే చర్యలను ఎవరూ చేపట్టకూడదని సూచించారు.

పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్, క్యారీ బ్యాగుల వినియోగాన్ని తగ్గించి, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని కోరారు.

కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, ఇన్‌చార్జ్ డీఆర్‌వో ఎల్. దేవకీదేవి, ఆర్డీవో కె. లక్ష్మీప్రసన్న, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఈఈ ఏ. రామచంద్రమూర్తి, సహాయక పర్యావరణ ఇంజినీర్లు కె. సంధ్య, ఎస్. రమేష్, ఇతర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 'శాస్త్ర, సాంకేతికత-ప్రిజమ్' కార్యక్రమం కింద ఇంటరాక్టివ్ కార్యశాల, సాంకేతిక మూల్యాంకన సమావేశాలను నిర్వహి గనుల మంత్రిత్వ శాఖ

న్యూ ఢిల్లీ, జూన్ 1:జవహంలాల్ నెహ్రూ అల్యూమినియం రీసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ సెంటర్ (జేఎన్ఏ ఆర్‌డీడీసీ), నాగ్‌పూర్ సహకారంతో శాస్త్ర,సాంకేతికత-ప్రిజమ్ 5.0 (అంకుర సంస్థలు, ఎమ్ఎస్ఎమ్ఈలలో పరిశోధన- ఆవిష్కరణల ప్రోత్సాహం) కింద గనుల మంత్రిత్వ శాఖ ఈ నెల 29-30 తేదీల్లో రెండు రోజుల ఇంటరాక్టివ్ కార్యశాల, సాంకేతిక మూల్యాంకన సమావేశాలను జేఎన్ఏఆర్‌డీడీసీ, నాగ్‌పూర్ వేదికగా విజయవంతంగా నిర్వహించింది. అంకుర సంస్థలు, ఎమ్ఎస్ఎమ్ఈలకు చెందిన ఆవిష్కర్తలు, పరిశ్రమ ప్రతినిధులు, కీలక ఖనిజాల రంగంలోని నిపుణులను ఒకచోట చేర్చే ఉమ్మడి వేదికను ఈ కార్యశాల అందించింది. గనుల మంత్రిత్వ శాఖ శాస్త్ర-సాంకేతికత కార్యక్రమంలోని మూడు భాగాల్లో శాస్త్ర, సాంకేతికత-ప్రిజమ్ పథకం ఒకటి. శాస్త్ర, సాంకేతికత-ప్రిజమ్ 5.0 కింద కీలక ఖనిజాల వ్యాపార నిర్వహణ కార్యకలాపాల్లో అన్వేషణ, వెలికితీత, ప్రాసెసింగ్, రీసైక్లింగ్, విలువ జోడింపు సాంకేతికతలు సహా వినూత్న ప్రతిపాదనలను గనుల మంత్రిత్వ శాఖ ఆహ్వానించింది.

జేఎన్ఏఆర్‌డీడీసీ డైరెక్టర్ డాక్టర్ అనుపమ్ అగ్నిహోత్రి, గనుల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ శ్రీ సుఖ్‌దీప్ సింగ్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీ సుఖ్‌దీప్ సింగ్ మాట్లాడుతూ... కీలక ఖనిజాల్లో స్వయం -సమృద్ధిని ప్రోత్సహించడానికి ఆవిష్కరణలు, సాంకేతికత అభివృద్ధిల ప్రాముఖ్యతను ప్రధానంగా ప్రస్తావించారు. అంకురసంస్థల మధ్య సహకారాన్ని, పోటీని ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమం సాంప్రదాయిక మూల్యాంకనం నుంచి ఒక ఇంటరాక్టివ్ కార్యశాలగా ఎలా మారిందో ఆయన వివరించారు.

శాస్త్ర, సాంకేతిక - ప్రిజమ్ పథకం కింద కీలక ఖనిజాల అన్వేషణ, ప్రాసెసింగ్, రీసైక్లింగ్ మొదలైన రంగాల్లో నిమగ్నమైన అంకుర సంస్థలకు అనుకూల వ్యవస్థను ప్రోత్సహించేందుకు, మూల్యాంకన ప్రక్రియతో పాటు ఒక ఇంటరాక్టివ్ కార్యశాలనూ మొదటిసారిగా నిర్వహించారు. పోటీ ఆధారిత విధానం ద్వారా అంకురసంస్థలు, ఎమ్ఎస్ ఎమ్ఈలు, విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడం, నిపుణులతో సంప్రదింపులు, నిర్మాణాత్మక అభిప్రా యాలు- అనుభవాలను పంచుకునే సంప్రదాయాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమ లక్ష్యం. ఈ కార్యశాలలో సీ-మెట్, డీఎంఆర్ ఎల్, సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ, సీఎస్ఐ ఆర్-ఎన్‌జీఆర్ఐ, సీఎస్ఐ ఆర్-ఎన్ఈఈఆర్ఐ మొదలైన సంస్థల నిపుణులు దరఖాస్తుదారులతో తమ సాంకేతిక సలహాలను పంచుకోవడంతో పాటు, వారికి అవసరమైన సహాయం అందించారు.

కీలక ఖనిజాల రంగంలో ఆశాజనకమైన సాంకేతికతలను గుర్తించడానికి ఆవిష్కరణ సవాళ్లు, పోటీ ఆధారిత మూల్యాంకన సమావేశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా అంకురసంస్థలు, ఎమ్ఎస్ఎమ్ఈలు తమ ఆవిష్కరణలను సాంకేతిక మూల్యాంకన కమిటీ (టీఈసీ) నిపుణుల ముందు ప్రదర్శించి, విలువైన సాంకేతిక అభిప్రాయాన్ని పొందేందుకు వీలు కలిగింది.

సమర్థ సాంకేతిక మూల్యాంకనం, థీమాటిక్ పోటీ కోసం... కీలక ఖనిజాల వ్యాపార కార్యకలాపాలను కవర్ చేస్తూ 31 ప్రతిపాదనలను ఏడు ప్రత్యేక సమూహాలుగా వర్గీకరించారు. ఈ సమూహాల్లో వ్యర్థాల ప్రవాహాలు, పారిశ్రామిక అవశేషాల నుంచి కీలక ఖనిజాల పునరుద్ధరణ, అన్వేషణ సాంకేతికతలు, వెలికితీత, వేరు చేయు ప్రక్రియలు, శుద్ధి-శుభ్రపరచడం, విలువ జోడించిన లోహాలు, మిశ్రమాలు, ప్రక్రియ పరికరాల అభివృద్ధి వంటి అంశాలు ఉన్నాయి. ఈ సమూహ-ఆధారిత విధానం... ఒకే రకమైన సాంకేతిక రంగాల్లో పనిచేస్తున్న ఆవిష్కర్తల మధ్య కేంద్రీకృత అంచనా, నిపుణుల మార్గదర్శకత్వం, అర్థవంతమైన పోటీకి వీలు కల్పించింది.

రెండో రోజులోని ముఖ్యాంశాల్లో ఒకటి విజయ గాథల సమావేశం. ఇందులో భాగంగా, పూర్వపు ప్రిజమ్ లబ్ధిదారులైన అశ్విని రేర్ ఎర్త్ ప్రైవేట్ లిమిటెడ్ (పూణే)... పాలిప్రోటిక్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (వడోదర)... సెల్‌ఆర్క్ పవర్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ (కటక్)... రెలిరా బ్లాస్టెక్ ఎల్ఎల్‌పీ (నాగ్‌పూర్) సంస్థలు... ఈ పథకం కింద తమ పారిశ్రామిక ప్రయాణాలను, అనుభవాలను పంచుకున్నాయి.

# సుమారు 105 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ... ఇద్దరి అరెస్టు

న్యూ ఢిల్లీ, జూన్ 1:దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం, మాదకద్రవ్యాల సరఫరా వ్యవస్థను నిర్మూలించడం కోసం చేస్తున్న నిరంతర ప్రయత్నంలో భాగంగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ఈ నెల 30వ తేదీన బీహార్‌లో 104.9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుంది. ఈ అక్రమ రవాణాలో పాల్గొన్న ఇద్దరు వ్యక్తులనూ ఎన్‌డీపీఎస్ చట్టం-1985లోని సంబంధిత నిబంధనల కింద అరెస్టు చేసింది.

దేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు వ్యతిరేకంగా డీఆర్ఐ చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ స్వాధీనం జరిగింది. గత ఏడాది కాలంలో బీహార్‌లో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, లక్నో జోనల్ యూనిట్ దాదాపు 46.5 కోట్ల రూపాయల విలువైన (అక్రమ మార్కెట్‌లో) మాదకద్రవ్యాలు, సైకోట్రోపిక్ పదార్థాలను స్వాధీనం చేసుకుంది. ఈ కేసులకు సంబంధించి 31 మందిని అరెస్టు చేసింది. ఈ స్వాధీనాల్లో 107.5 కిలోల చరస్, 1277.81 కిలోల గంజాయి, 18.92 కిలోల అత్యంత నాణ్యమైన హైడ్రోఫోనిక్ గంజాయి, 6 కిలోల కొకైన్, 112.8 గ్రాముల హెరాయిన్, అక్రమ వినియోగం కోసం తరలిస్తున్న 8,012 సీసాల కోడీన్ ఆధారిత దగ్గు సిరప్‌లు ఉన్నాయి.

# పీఎమ్-సేతు కింద తొలి వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళిక ఆమోదాన్ని దక్కించుకున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా

న్యూఢిల్లీ, జూన్ 1:'ప్రధాన మంత్రి - నైపుణ్యాభివృద్ధి, ఉన్నతీకరించిన ఐటీఐల ద్వారా ఉపాధి కల్పన పరివర్తన' (పీఎం-సేతు) పథకం కింద ఒక చరిత్రాత్మక పరిణామంగా... ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్ కోసం ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా (ఏఎం/ఎన్ఎస్ ఇండియా) సమర్పించిన వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళిక (ఎస్ఐపి)కి జాతీయ స్టీరింగ్ కమిటీ (ఎన్ఎస్‌సీ) ఆమోదం తెలిపింది. ఈ ఆమోదం ద్వారా పీఎం-సేతు కింద ఆమోదం పొందిన తొలి వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళికగా నిలవడమే కాకుండా, ఈ పథకం కింద ఒక పారిశ్రామిక భాగస్వామ్యాన్ని కార్యాచరణలోకి తెచ్చిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది.

భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికీకరణ మంత్రిత్వ శాఖ (ఎమ్ఎస్‌డీఈ) ఆధ్వర్యంలో, న్యూఢిల్లీలోని కౌశల్ భవన్ వేదికగా నిర్వహించిన 3వ జాతీయ స్టీరింగ్ కమిటీ సమావేశంలో ఈ ఆమోదం లభించింది. రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రముఖ పారిశ్రామిక సంస్థల మధ్య బలమైన భాగస్వామ్యాల ద్వారా ప్రభుత్వ ఐటీఐలను పరిశ్రమల నిర్వహణలో నడిచే, ఫలితాల-ఆధారిత సంస్థలుగా అభివృద్ధి చేసే పీఎమ్-సేతు పథకం దార్శనికతను అమలు చేసే దిశగా ఇది తొలి కీలక ముందడుగు.

నైపుణ్యాభివృద్ధి, పారిశ్రామికీకరణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి దేబాశ్రీ ముఖర్జీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి... జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యులతో పాటు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ (డీజీటీ) డైరెక్టర్ జనరల్ శ్రీ దిలీప్ కుమార్ హాజరయ్యారు. కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ (సీబీసీ), నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీవీఈటీ), వాణిజ్యం-పరిశ్రమల మంత్రిత్వ శాఖ, భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, కార్మిక-ఉపాధి మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలు, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచఏఎల్), హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో, ఐటీసీ లిమిటెడ్, ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ (ఏఎమ్/ఎన్ఎస్) ఇండియా వంటి పారిశ్రామిక దిగ్గజాలు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ), ప్రపంచ బ్యాంక్ వంటి అభివృద్ధి భాగస్వాముల నుంచి సీనియర్ ప్రతినిధులు ఈ చర్చల్లో పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్ కోసం ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా సమర్పించిన వ్యూహాత్మక పెట్టుబడి ప్రణాళికకు ఆమోదం లభించడం ఈ సమావేశ కీలక ఫలితం. ఈ ఆమోదంతో, పీఎమ్-సేతు పథకం కింద ఒక యాంకర్ ఇండస్ట్రీ పార్టనర్ (ఏఐపీ)ని చేర్చుకున్న తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. తద్వారా, ఈ పథకం కింద అంచనా వేసిన పరిశ్రమల నేతృత్వంలోని హబ్-అండ్-స్పోక్ నమూనా కార్యాచరణలో ఇది కీలక మైలురాయిగా నిలిచింది.

విశాఖపట్నం క్లస్టర్‌కు లభించిన ఆమోదం... మారుతున్న శ్రామిక శక్తి అవసరాలకు అనుగుణంగా స్పందించగల, పరిశ్రమల నిర్వహణ గల, ఫలితాల-ఆధారిత సంస్థలుగా పారిశ్రామిక శిక్షణా సంస్థలను మార్చే దిశగా కీలక ముందడుగు అవుతుంది. ఈ ప్రతిపాదనకు లభించిన ఆమోదం... వృత్తి విద్యా శిక్షణలో పరిశ్రమల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని, దేశవ్యాప్తంగా పీఎమ్-సేతు కార్యక్రమాల అమలును వేగవంతం చేయాలనీ కోరుకుంటున్న ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని భావిస్తున్నారు.

భాగస్వామ్య రాష్ట్రాల్లో పీఎమ్-సేతు అమలు పురోగతిని జాతీయ స్టీరింగ్ కమిటీ సమీక్షించింది. పరిశ్రమల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, సంస్థాగత పాలనను మెరుగుపరచడం, ప్రత్యేక ప్రయోజన వాహనాల (ఎస్‌పీవీల) ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడం, పథకం కింద ప్రాజెక్టుల కార్యాచరణను వేగవంతం చేయడం లక్ష్యంగా నిర్దేశించుకున్న విధానపరమైన, అమలు చర్యలను కమిటీ చర్చించింది.

# పన్నెండేళ్ల సాంకేతిక రూపాంతరీకరణతో 2047 లక్ష్య సాధనకు పునాది: డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జూన్ 1:భారత్ 2047 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాల సాకారంలో గడచిన పన్నెండేళ్ల సాంకేతిక రూపాంతరీకరణ పునాది వేసిందని కేంద్ర శాస్త్ర-సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్ర, (స్వతంత్ర బాధ్యత) ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది-ప్రజా సమస్యలు-పింఛన్లు, అణుశక్తి, అంతరిక్ష మంత్రిత్వ శాఖల సహాయమంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వాన ఆధునిక సాంకేతికతలను అనుసరించే దేశం స్థాయి నుంచి అగ్రగ్రామిగా భారత్ ఎదిగిందని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ శాస్త్ర విజ్ఞాన రంగంలో భారత్ మౌలిక స్వరూపాన్ని ఇలా తీర్చిదిద్దింది ఈ రూపాంతరీకరణేనని వివరించారు.

ఈ అంశంపై 'దూరదర్శన్ న్యూస్' చానెల్‌తో ఒక 'పాడ్ కాస్ట్'లో డాక్టర్ జితేంద్ర సింగ్ అనేక అంశాలను ప్రస్తావించారు. ఇతర దేశాల్లో ఆవిర్భవించిన సాంకేతిక పరిజ్ఞానాలను భారత్ దశాబ్దాలపాటు అనుసరిస్తూ వచ్చిందని ఆయన గుర్తుచేశారు. ఆ క్రమంలో అత్యాధునిక సాంకేతిక రంగాల్లో ప్రవేశించడంలో అగ్రగామి దేశాలకన్నా ఎన్నో ఏళ్లు వెనుకబడిందని చెప్పారు. అయితే, సరికొత్త సాంకేతికతలను ఆవిష్కరించడంలో నేడు అంతర్జాతీయ స్థాయిలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. అనేక రంగాల్లో ఆవిష్కరణలకు భవిష్యత్ దిశను నిర్దేశించడంలో తోడ్పాటునిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ మేరకు "గడచిన పన్నెండేళ్ల రూపాంతరీకరణే ఆధునిక సాంకేతికతల అనుసరణ దేశం నుంచి అగ్రగ్రామి స్థాయికి భారత్‌ను తీర్చిదిద్దింది. ఈ పుష్కర కాలంలో దేశం సృష్టించిన శాస్త్ర విజ్ఞాన సామర్థ్యాలు, రూపొందించిన ఆవిష్కరణాధారణ వ్యవస్థ, సాంకేతిక మౌలిక సదుపాయాలు 'వికసిత భారత్‌ఏ2047'కు పునాది వేశాయి" అని డాక్టర్ జితేంద్ర సింగ్ విశదీకరించారు.

జాతీయ విధాన రూపకల్పనలో శాస్త్ర, సాంకేతిక రంగాలకు ప్రధాని మోదీ కీలక స్థానమిచ్చారని గుర్తుచేశారు. ప్రైవేట్ రంగ భాగస్వామ్యం పెంపు, ఆవిష్కరణాధారిత వ్యవస్థాపనకు ప్రోత్సాహం, శాస్త్రీయ పురోగమనాన్ని పౌర ప్రయోజనకరంగా మార్చడంపై శ్రద్ధ వహించారని చెప్పారు. ఆర్థిక వృద్ధి, వ్యూహాత్మక సామర్థ్య వికాసం, ప్రజాసేవా ప్రదానంలో ఒకేసారి మద్దతివ్వగల సాంకేతికావరణ వ్యవస్థ నిర్మాణంలో ఈ విధానవే చోదకశక్తిగా నిలిచిందన్నారు.

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలలో భారత్ ప్రాబల్యం ఇనుమడిస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. అంతరిక్షం, అణుశక్తి, క్వాంటం- జీవసాంకేతికతలు, కృత్రిమ మేధ (ఏఐ), కాలుష్యరహిత ఇంధనం వంటి అనేక రంగాలలో దేశ గణనీయ పురోగమనమే ఇందుకు నిదర్శనమని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. ఈ రంగాలన్నీ దేశం 2047 నాటికి వికసిత భారత్‌గా రూపొందడానికి అవసరమైన శాస్త్ర-సాంకేతిక పునాది వేశాయన్నారు.

అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి వీలు కల్పించడంతో ప్రపంచంలో అత్యంత చైతన్యవంతమైన అంతరిక్ష పర్యావరణ వ్యవస్థలలో ఒకటిగా భారత్ ఆవిర్భవించిందని చెప్పారు. ఈ క్రమంలో అంతరిక్ష రంగ అంకుర సంస్థల సంఖ్య ఒకటి నుంచి 400 దాటిందని తెలిపారు. దీంతో భారత్ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ విలువ నేడు దాదాపు 9 బిలియన్ డాలర్లు కాగా, భవిష్యత్తులో గణనీయంగా విస్తరించగలదని అంచనాలు చెబుతున్నాయని పేర్కొన్నారు.

భారత్ సాధించిన అంతరిక్ష విజయాల వల్ల శాస్త్రవిజ్ఞానంతో ప్రజల అనుబంధం పూర్తిగా పరిణామం చెందిందని చెప్పారు. నవ తరం ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలకు ఈ విజయాలు ఎనలేని స్ఫూర్తినిచ్చాయని డాక్టర్ జితేంద్ర సింగ్ గుర్తుచేశారు. సమాచార ఆదానప్రదానం, మౌలిక సదుపాయాల ప్రణాళిక, పరిపాలన, విపత్తుల నిర్వహణ, వ్యవసాయం, జాతీయ భద్రత వంటి అంశాల్లో నేటి అంతరిక్ష సాంకేతికతలు పూర్తి మద్దతిస్తున్నాయని చెప్పారు. తద్వారా అవి దైనందిన ప్రజా జీవనంలో మరింతగా వినియోగంలోకి వస్తున్నాయని వివరించారు.

భారత దీర్ఘకాలిక ఇంధన వ్యూహంలో 'ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్' రూపకల్పన ఓ ప్రధాన ఘట్టమని మంత్రి అభివర్ణించారు. డాక్టర్ హోమీ జహంగీర్ భాభా నిర్దేశించిన 3 దశల అణు కార్యక్రమానికి ఈ విజయం సారథ్యం వహిస్తుందని తెలిపారు. దేశ ఇంధన భద్రత, స్వావలంబన దిశగా భారత్ ప్రగతి ప్రస్థానాన్ని ఇది మరింత బలోపేతం చేస్తుందన్నారు.

అణుశక్తి రంగంలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యం పెంపు లక్ష్యంగా ఇటీవల ప్రవేశపెట్టిన సంస్కరణలతో అంకుర సంస్థలు, పారిశ్రామికవేత్తలు, సాంకేతికత ఆధారిత సంస్థలకు కొత్త అవకాశాలు కల్పించాయని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈ సంస్కరణల ద్వార ఆవిష్కరణలు వేగం పుంజుకుంటూ అత్యాధునిక ఇంధన సాంకేతికతలలో భారత్ సామర్థ్యాన్ని మరింత విస్తరిస్తాయని తెలిపారు.

జాతీయ క్వాంటం మిషన్ సాధించిన ప్రగతిని ఈ సందర్భంగా డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. ఇది ప్రారంభమయ్యాక తొలి సంవత్సరాల్లోనే 2,000 కిలోమీటర్ల క్వాంటం కమ్యూనికేషన్ సామర్థ్య సాధన లక్ష్యంలో దాదాపు సగం స్థాయిని భారత్ అందుకున్నదని ఆయన సగర్వంగా ప్రకటించారు. ప్రపంచంలో అత్యంత వ్యూహాత్మక సాంకేతిక రంగాలలో ఒకటైన క్వాంటం రంగంలో విస్తరిస్తున్న భారత్ నైపుణ్యాన్ని ఈ పురోగమన వేగం ప్రతిబింబిస్తోందని ఆయన అన్నారు. సురక్షిత కమ్యూనికేషన్లు, రక్షణ సంసిద్ధత, భావితరం డిజిటల్ మౌలిక సదుపాయాల బలోపేతంలో క్వాంటం కమ్యూ నికేషన్ సాంకేతికతలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. తద్వారా క్వాంటం విజ్ఞానంలో అగ్రస్థానాన గల కొన్ని దేశాల జాబితాలో భారత్ స్థానం పొందగలదని మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

జీవసాంకేతిక రంగం గురించి వివరిస్తూ- 'బయోఈ3' విధానం ద్వారా ఈ సాంకేతిక ఆధారిత పారిశ్రామిక రూపాంతరీరణకు భారత్ సిద్ధమవుతోందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. బయోటెక్నాలజీ, జన్యుశాస్త్రం, బయో -మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ప్రగతితోనే భవిష్యత్ ఆర్థిక వ్యవస్థ అధిక శాతం రూపుదిద్దుకుంటుందని ఆయన చెప్పారు. ఈ రంగాల్లో అగ్రస్థానం దిశగా దేశం చురుగ్గా చర్యలు చేపడుతున్నదని తెలిపారు. జీనోమ్ సీక్వెన్సింగ్, అరుదైన వ్యాధుల నిర్ధారణ-చికిత్స, స్వదేశీ ఔషధ రూపకల్పన, జన్యు-చికిత్సలో ప్రగతి వంటి కార్యక్రమాలు ఇనుమడిస్తున్న భారత శాస్త్రవిజ్ఞాన సామర్థ్యానికి కొన్ని ఉదాహరణలని ఆయన పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యంగల పరిష్కారాల ఆవిష్కరణలో భారత్ సామర్థ్యాన్ని ఇవన్నీ బలోపేతం చేస్తున్నాయని తెలిపారు.కృత్రిమ మేధ (ఏఐ) రంగ ంలో దేశం ముందంజను వివరిస్తూ- పరిపాలన, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, సమాచార ప్రసారం, శాస్త్ర పరిశోధనలు, ప్రజాసేవా ప్రదానం వంటి రంగాల్లో 'ఏఐ' ఒక పరిణామాత్మక శక్తిగా ఆవిర్భవిస్తున్నదని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. సామర్థ్యం, ఆవిష్కరణలు, పౌర-కేంద్రక పరిపాలన వగైరాల మెరుగుదలలో మానవ నైపుణ్యాన్ని కృత్రిమ మేధ సమర్థ వ్యవస్థలతో జోడించే సమతుల విధానాన్ని దేశం నేడు అనుసరిస్తోందని ఆయన గుర్తుచేశారు. కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలు, సమాచార నిధులు, ఆవిష్కరణలు, ఆధనిక అనువర్తనాలలో పెట్టుబడులు పెడుతున్నదని పేర్కొన్నారు. తద్వారా అత్యాధునిక డిజిటల్ సాంకేతికతలలో భారత్ భవిష్యత్ అగ్రగామిగా ఎదిగే దిశగా 'ఇండియా ఏఐ మిషన్' బలమైన పునాది వేస్తోందని పేర్కొన్నారు.

భారత విస్తృత ఆవిష్కరణావరణ వ్యవస్థ గడచిన దశాబ్దంలో వేగంగా పురోగమించిందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ప్రపంచ అగ్రగామి అంకుర గమ్యాల్లో భారత్ ఒకటిగా ఎదగడం, పేటెంట్ దరఖాస్తుల సమర్పణలో గణనీయ వృద్ధి, ప్రపంచ ఆవిష్కరణల ర్యాంకింగ్ మెరుగుదల, శాస్త్రవిజ్ఞాన ప్రచురణ సంఖ్య పెరుగుదల వంటివి ఇందుకు కొన్ని నిదర్శనాలని మంత్రి గుర్తుచేశారు. ఇతర దేశాల్లో రూపొందిన సాంకేతికతల వాడుకునే దేశంగా కాకుండా ప్రపంచ సవాళ్లకు అసలైన ఆవిష్కరణలు, పరిష్కారాలను సృష్టించేదిగా భారత్ గుర్తింపు నానాటికీ విస్తరిస్తున్నదని ఆయన చెప్పారు.

కాలుష్య రహిత ఇంధన రంగాన్ని ప్రస్తావిస్తూ- అణుశక్తి, గ్రీన్ హైడ్రోజన్, సౌరశక్తి, వర్ధమాన అత్యాధునిక సముద్రాధారిత ఇంధన వ్యవస్థల సమ్మేళనంతో భారత్ ఒక వైవిధ్యభరిత వ్యూహాన్ని అనుసరిస్తున్నదని డాక్టర్ జితేంద్ర సింగ్ వెల్లడించారు. సుస్థిర ప్రగతి, 2070 నాటికి నికరశూన్య ఉద్గార లక్ష్య సాధనపై భారత్ దీర్ఘకాలిక నిబద్ధతకు అనుగుణంగా ఈ కార్యక్రమాలన్నీ అమలవుతున్నాయని ఆయన అన్నారు.

ప్రపంచం ఇప్పటిదాకా పెద్దగా దృష్టి సారించని నీలి ఆర్థిక వ్యవస్థ, అగాధ సముద్ర వనరులు, హిమాలయ జీవ వనరులు, అధునాతన బయోటెక్నాలజీ, భావితరం తయారీ సాంకేతికతలు వంటివి భారత వృద్ధి పథంలో తదుపరి దశకు సారథ్యం వహిస్తాయని మంత్రి చెప్పారు. ఈ రంగాలకు సంబంధించి భారత దేశానికి అధికశాతం ప్రత్యేక, సహజ వనరులతోపాటు శాస్త్రీయ ప్రయోజనాలు లభిస్తాయని చెప్పారు. వీటిని ప్రగతి ప్రస్థానానికి చోదక శక్తులుగా మార్చగల అనువైన పరిస్థితులు భారత్‌లో ఉన్నాయని వివరించారు.

గడచిన పుష్కర కాలంలో భారత్ పయనాన్ని బృహత్తర జాతీయ రూపాంతరీకరణకు నాందిగా పరిగణించాని డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. భారత్ అగ్రగామి విజ్ఞానార్థిక వ్యవస్థగా ఆవిర్భవించడంలో ఈ పన్నెండేళ్లు కీలక పాత్ర పోషించాయని చెప్పారు. దేశంలో శాస్త్ర విజ్ఞానంపై విశ్వాసంతోపాటు సాంకేతిక సామర్థ్యం, ఆవిష్కరణారణ వ్యవస్థ బహుముఖంగా విస్తరించి, 'వికసిత భారత్‌ఏ2047' స్వప్న సాకారానికి బాటలు వేశాయని చెబుతూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# సిరిచేల్మా ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ..

నల్గొండ, జూన్ 1:ఇచ్చోడ మండలంలోని ప్రసిద్ధ పురాతన పుణ్యక్షేత్రం సిరిచేల్మా శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ ప్రధాన రహదారిపై కల్వర్టు నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శంకుస్థాపన చేశారు.

రూ.30 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ పనులకు ముందు ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు విజయవంతంగా పూర్తికావాలని ప్రార్థించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిరిచేల్మా శ్రీ మల్లికార్జున స్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొన్నారు. ఆ నిధులను వీలైనంత త్వరగా మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని అన్నారు.

ఆలయానికి భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రధాన రహదారిపై కల్వర్టు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, ఇచ్చోడ ఉప సర్పంచ్ శిరీష్ రెడ్డి, మహేందర్ రెడ్డి, పాండు, గడిగే సుభాష్, మల్లేష్, రషీద్, నజీర్, నర్వడే రమేష్, కరీం, సురేందర్ గౌడ్, విజేందర్, అలీం, బాపురావు, సూర్యకాంత్, నరేష్, సచిన్, రాంచందర్, పొచ్చన్నతో పాటు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాలుగు నెలల జీతాలు వెంటనే చెల్లించాలి..

## అచ్చంపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీపీ కార్మికుల ధర్నా




నల్గొండ, జూన్ 1: గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జీపీ కార్మికులు సోమవారం అచ్చంపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. శంకర్ నాయక్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు గ్రామపంచాయతీ కార్మికులకు గ్రీన్ బడ్జెట్ ద్వారా నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. అలాగే మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి, కనీస వేతనం రూ.26 వేలుగా అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, రూ.20 లక్షల ప్రమాద బీమా అందించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# ఆదర్శవంతమైన గురువు గుణాలను చాటిచెప్పే సంస్కృత సుభాషితాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 1:కొంతమంది ఏదైనా పనిని పూర్తి చేయడంలో చేయితిరిగిన వారై ఉంటారనీ, మరికొందరు ముఖ్యంగా నైపుణ్యాన్ని, లేదా జ్ఞనాన్ని ఇతరులకు బోధించడంలో ప్రవీణులై ఉంటారనీ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ఈ రెండు గుణాల్నీ .. అంటే తాను స్వయంగా సంపాదించిన విశేష ప్రజ్ఞతో పాటు, ఇతరులకు నేర్పించగల సామర్థ్యాన్ని కూడా కలిగి ఉంటే అప్పుడు అలాంటి వ్యక్తి సర్వశ్రేష్ఠ గురువుల్లో ఒకరుగా గౌరవాన్ని పొందవచ్చునని ప్రధానమంత్రి వివరించారు.

"శ్లిష్టా క్రియా కస్య చిదాత్మ సంస్థా సడంక్రాన్తిపయితవ్య ఏవ
యస్యోభయం సాధు స శిక్షకాణాం ధురి ప్రతిష్ఠా పయితవ్య ఏవ" అని సంస్కృత భాషలో ఉన్న ఓసుభాషితాన్ని ప్రజలతో ప్రధానమంత్రి పంచుకున్నారు.

కొందరు వ్యావహారంలో నిపుణలైతే, మరి కొందరు బోధనలో నిపుణులుగా ఉంటారు. అదే.. ఒక వ్యక్తి ఏదైనా విషయంలో ప్రావీణ్యం కలిగివుండడంతో పాటు ఆ ప్రావీణ్యాన్ని పరులకు ప్రభావవంతమైన పద్ధతిలో బోధించే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నప్పుడు, అలాంటి వ్యక్తి.. గురువుల్లో అగ్రగణ్య స్థానాన్ని అందుకొనే అర్హతను పొందుతారని ఈ సుభాషితం సూచిస్తోంది.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధానమంత్రి ఒక సందేశాన్ని పొందుపరుస్తూ:

"శ్లిష్టా క్రియా కస్య చిదాత్మ సంస్థా సడంక్రాన్తిపయితవ్య ఏవ
యస్యోభయం సాధు స శిక్షకాణాం ధురి ప్రతిష్ఠాపయితవ్య ఏవ" అని పేర్కొన్నారు.

# బీసీ బిడ్డపై నిందారోపణలు చేస్తే సహించబోం

**-బీసీ సంఘ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బోళ్ళ కరుణాకర్**

సూర్యాపేట , జూన్ 1:మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు, బీజేపీ నేత ఈటెల రాజేందర్ పై తప్పుడు ఆరోపణలు చేసన్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం దుర్మార్గపు చర్య అని బీసీ సంఘ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బోళ్ళ కరుణాకర్ అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సుదీర్ఘకాలం పాటు శాసన సభ్యులుగా, తెలంగాణ రాష్ట్ర తొలి ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన ప్రజల మద్దతుతో రాష్ట్రంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగాడని గుర్తు చేశారు.

రాజకీయంగా అవగాహన లేని వ్యక్తులు రాత్రికి రాత్రే దొంగ చాటుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలను తప్పుద్రోవ పట్టించాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాజేందర్ ఎదుగుదలను జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులే ఈ దుర్మార్గపు చర్యకు పాల్పడి ఉంటారన్నారు. త్వరలో జరగనున్న కేంద్ర ప్రభుత్వ మంత్రి వర్గ విస్తరణలో ఈటలకు స్థానం లభించ బోతుందని కావాలనే సొంత పార్టీ నేతలే ఈ చర్యను ప్రోత్సహించి ఉంటారనే అనుమానం వ్యక్తం చేశారు. వక్రబుద్ధి బుద్ధి కలిగిన నాయకులు బీసీ బిడ్డపై నిందారోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ విద్యార్ధి సంఘ రాష్ట్ర జేఏసీ చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్, నాయకులు ముద్ద బిక్షపతి యాదవ్, బొర్ర విజయ్, పేరాల సాయి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి



అమరావతి, జూన్ 1: ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌లో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు.

జిల్లా కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా రెవెన్యూ అధికారి బి. శివన్నారాయణ రెడ్డి, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి ఎ. వెంకటలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎన్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నిర్ణీత గడువు లోపల ప్రతి ఫిర్యాదుకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి, వారు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఆకివీడు మండలం పెదకాపవరానికి చెందిన జి. లక్ష్మి మానస తనకు ఉన్న 3 ఎకరాల వ్యవసాయ భూమిలో 1బి, అడంగల్‌లో 2.72 ఎకరాలు మాత్రమే నమోదైనట్లు తెలిపారు. 28 సెంట్ల భూమి తగ్గినట్లు పేర్కొని రీ సర్వే చేసి ఆన్లైన్‌లో సవరణ చేయాలని కోరారు.

వీరవాసరం మండలం అండలూరు గ్రామానికి చెందిన కుసుమలక్ష్మి 2024లో ప్రభుత్వం 72 గజాల ఇంటి స్థల పట్టా ఇచ్చిందని, ఇప్పటివరకు స్థలం చూపించలేదని తెలిపారు. సరిహద్దులు గుర్తించి స్థలం అందించాలని అర్జీ సమర్పించారు.

కొణితివాడ బుధరాయుడు చెరువు నివాసి బాల ఏడుకొండలు గ్రామంలో లో వోల్టేజీ, హై వోల్టేజీ కారణంగా సుమారు 20 లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. అదనపు ట్రాన్స్ఫార్మర్ మంజూరై నాలుగు నెలలు గడిచినా ఏర్పాటు కాలేదని, వెంటనే కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు.

పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చెందిన బిక్కిన సాంబశివరావు కంటి చూపు తగ్గడంతో రోజువారీ పనులు చేయలేక ఇబ్బంది పడుతున్నానని తెలిపారు. వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని కోరారు.

పెనుగొండ గ్రామానికి చెందిన తమనంపూడి వెంకట రామకృష్ణారెడ్డి తన 10 సెంట్ల భూమిలో 1 సెంట్ ఆన్లైన్‌లో నమోదు కాలేదని తెలిపారు. రీ సర్వే చేసి పూర్తి నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.

తణుకు పురపాలక సంఘం 7వ వార్డు నివాసితులు తమ వార్డులో రోడ్డు, త్రాగునీటి సదుపాయాలు లేవని తెలిపారు. వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి పత్రం అందించారు.

ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# పత్తి పంటలో అంతర పంటతో అధిక లాభాలు



ఆదిలాబాద్, జూన్ 1: రైతులు వర్షాకాలం సాగు చేసే పత్తి పంటలో అంతర పంటలు వేయడం వల్ల తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చని ఊట్కూర్ మండల వ్యవసాయ శాఖ అధికారిగణేష్ రెడ్డిసూచించారు. సోమవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలపరిధిలోని అమీన్ పూర్ రైతు వేదిక భవనంలో పత్తిపంటలో అంతర పంట సాగుపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పత్తిలో అంతర పంటలు తప్పనిసరిగా వేయాలని ప్రతి మూడు నాలుగు వరుసలకు ఒక వరుస కంది, ఆముదం, ఇతర పంటలతో అంతర పంటలు వేయాలని సూచించారు.

గత ఆరు ఏడు సంవత్సరాలగా మండలంలో సుమారు 40 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు చేయడం చేయడం జరుగుతుందనిదీనివల్ల చిడిపిడలు పురుగుల ఉధృతి పెరిగి రైతులు నష్టపోతున్నారని అన్నారు. పత్తి పంటకు వివిధ తెగుళ్లు సోకడంవల్ల రైతులు నష్టపోతున్నారనిఅన్నారు. ప్రతి రైతు విధిగా పంట మార్పిడి విధానం అలవర్చుకోవాలన్నారు. వరి పంట వ్యర్థాలు కాల్చడం వలన కలిగే దుష్పరిమాణాలు నకిలీ పత్తి విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వర్షాకాలంలో పుష్కలంగా వర్షాలు కురిసిన తర్వాత రైతులు పంటలు సాగు చేయాలనిఅన్నారు. తేలికపాటి వర్షాలకు పంటలు సాగు చేయడం వల్ల రైతులు నష్టపోతారని అన్నారు. ప్రతి రైతు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనల మేరకు పంటలు సాగు చేసి మందులు వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టప్ప నాగేష్, ఏఈఓ రజిత, స్వచ్ఛ దర్శనం ఫౌండేషన్ నిర్వాహకులు సత్యనారాయణ, ప్రకృతి రైతు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్-ఒమన్ సీఈపీఏ దాని ప్రయోజనాలను వివరిస్తున్న వ్యాసాన్ని ప్రజలతో పంచుకున్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 1:కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్ రాసిన ఒక వ్యాసాన్ని ప్రజలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పంచుకున్నారు.

ఈ వ్యాసం ప్రధానంగా భారత్-ఒమన్ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) భారతీయ ఎగుమతిదారు సంస్థలకు మార్కెట్లను విస్తరించుకొనే అవకాశాన్ని ఇవ్వడం, ఉద్యోగావకాశాల్ని పెంచడం, రైతుల ప్రయోజనాల్ని కాపాడడంతో పాటు, ఇరు దేశాల మధ్య సమృద్ధిని ఎలా పెంపొందింపచేస్తుందో వివరించింది. అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషి దేశ పౌరుల జీవితాన్ని మెరుగుపరచడంలో తోడ్పడుతోందని కూడా ఈ వ్యాసం స్పష్టం చేస్తోంది.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధానమంత్రి కార్యాలయం ఒక సందేశాన్ని పొందుపరుస్తూ:

"భారత్-ఒమన్ సీఈపీఏ.. భారతీయ ఎగుమతిదారు సంస్థలకు మార్కెట్లను విస్తరించుకొనే అవకాశాన్ని ఇవ్వడం, ఉద్యోగావకాశాలను పెంచడం, రైతుల ప్రయోజనాలను కాపాడడంతో పాటు ఇరు దేశాల మధ్య సమృద్ధిని ఎలా పెంపొందింపచేస్తుందో ఈ వ్యాసంలో కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్ వివరించారు.


అభివృద్ధి చెందిన దేశాలతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకునే దిశగా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు దేశంలో ప్రతి ఒక్కరి జీవితాన్ని మెరుగుపరచడంలో తోడ్పడుతున్నాయని ఆయన స్పష్టం చేశారు" అని పేర్కొంది.

# పలు ప్రత్యేకతల సమాహారం దుగ్గిరాల జీవనయానం

తమ తాత తండ్రుల నాటినుండి నివాసముంటున్న తమ ఆవాస స్థానాలను వదిలి, కేవలం ఒక వ్యక్తి చెప్పిన మాటలను తూ.చా తప్పకుండా పాటించి ఒక నిరసన తెలియ జేయడం కోసం లక్ష్య సాధన ధ్యేయంగా గ్రామాలనే వదిలి వెళ్ళిన ఉదంతం చరిత్రలో ఎక్కడా జరిగి ఉండదు. భారత స్వాతంత్ర్యోద్యమ సమయంలో ఒక అరుదైన స్ఫూర్తిదాయకమైన సంఘటన తెలుగు నేలపై జరిగింది. ఒకరు కాదు ఇద్దరు కాదు, పదులు కాదు వందలు కాదు, రెండు గ్రామాలకు చెందిన పదిహేడు వేల మంది ఆ సంఘటనలో స్వగ్రామాలు వదిలి సరి హద్దులు దాటి బయట సంవత్సర కాలంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ లక్ష్యం కోసం జీవితాలు గడపాలంటే అది సామాన్యమైన విషయం కాదు. అలా వేలాది మంది అభిమానాన్ని చూరగొని వారిని సంఘటితంగా ఒక్కటిగా నిలిపిన ఘనత ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు, తెలుగు వాడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య దక్కుతుంది. 1919 లో బ్రిటిష్ ప్రభుత్వం చీరాల, పేరాల రెండు గ్రామాలను కలిపి మునిసిపాలిటీగా విలీనం చేసినపుడు, అధిక పన్నులు చెల్లించడానికి వ్యతిరేకంగా జరిగిన సహాయ నిరాకరణోద్యమానికి గోపాల కృష్ణయ్య నాయకుడు. ఇది స్వాతంత్ర్య పోరాటంలో ఒక ముఖ్యమైన గాంధీజీ సందర్శించి అభినందించిన చీరాల పేరాల సమరం సుప్రసిద్ధం, ముఖ్య ఘట్టం.

స్వాతంత్ర్య సమర యోధుల్లో ప్రముఖుడు దుగ్గిరాల గోపాల కృష్ణయ్య (జూన్ 2, 1889 – జూన్ 10, 1928) ఆయన గొప్ప నాయకుడు, సాహసికుడు, వక్త, కవి, గాయకుడు. ఆంధ్ర రత్న బిరుదు బిరుదాంకితుడు.

కృష్ణా జిల్లా, పెనుగంచిప్రోలు గ్రామంలో 1889 జూన్ 2 న దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జన్మించారు. ఆయన పుట్టిన మూడవ రోజునే తల్లి సీతమ్మ, మూడో ఏట తండ్రి కోదండ రామస్వామి మరణించారు. అప్పటినుండి పినతండ్రి, నాయనమ్మల సంరక్షణలో పెరిగారు. కూచిపూడిలోను, గుంటూరులోను ప్రాథమిక విద్య జరిగింది. హైస్కూలులో చదివే సమయంలోనే 'జాతీయ నాట్య మండలి' స్థాపించి సంగీత, నాటక కార్యక్రమాలు నిర్వహించారు. అయితే చదువుపై అంత శ్రద్ధ చూపక పోవడం చేత మెట్రిక్యులేషనులో తప్పారు. తరువాత బాపట్ల లో చదివి ఉత్తీర్ణుడయ్యారు.



నడింపల్లి వెంకట లక్ష్మీ నరసింహారావు అనే ఒక మిత్రుని సాయంతో 1911లో స్కాట్లండు లోని ఎడింబరో విశ్వ విద్యాలయంలో ఎం.ఎ. చదివారు. తరువాత ఆనంద కుమార స్వామితో కలసి కొంతకాలం పని చేశారు.

1916లో తిరిగి భారతదేశం వచ్చిన దుగ్గిరాల, నాటి జాతీయ ఉద్యమానికి కేంద్రంగా వున్న బందరులోని జాతీయ కళాశాలలో ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలో నందికేశ్వరుడు రచించిన 'అభినయ దర్పణం' అనే గ్రంథాన్ని "ఽష్ట్రవ ఓతితీతీనీతీ నీట ఉవబబీబీతీవ," అన్న పేరుతో సంస్కృతం నుండి ఆంగ్లంలోకి అనువదించారు. ఇది 1917లో 'కేంబ్రిడ్జ్ – హార్వర్డ్ యూనివర్శిటీ ప్రెస్' వారిచే ప్రచురించ బడడం విశేషం.

1920లో మహానందిలో జరిగిన ఆంధ్రమహాసభకు అధ్యక్షుడిగా ఒక అంగవస్త్రం, ఒక కండువా, మెడలో రుద్రాక్షమాలతో ప్రత్యక్షమయ్యారు. నాటి నుండి దాదాపుగా ఆయన జీవితం శ్రీరామచంద్రునికే అంకితమన్న రీతిలో సాగింది. 1921 లో గుంటూరులో ఒక సభలో "ఆంధ్ర రత్న" అన్న బిరుదుతో ఆయనను సత్కరించారు. 1921లో బెజవాడ కాంగ్రెస్ సమావేశాలను దుగ్గిరాల తయారు చేసిన వెయ్యిమంది ఎర్రని చొక్కా కుంకుమ బొట్టు ధరించిన ఆ రామదండు సేవా దళమే విజయవంతం చేశారు. రామదండు దుగ్గిరాలకు నమ్మిన బంట్లుగా మిగిలారు. ఆయనలోని ప్రతిభకు అలిండియా కాంగ్రెస్ కార్యదర్శి పదవి దక్కింది. ఆ పదవి దక్కించుకున్న అతి పిన్న వయస్కుడు, తొలి ఆంధ్రుడు ఆయనే. జాతీయ కాంగ్రెస్ ఆఫీసును విజయ వాడలో పెట్టించింది దుగ్గిరాల గోపాలకృష్ణయ్యే. కుటిల రాజకీయ నేతల మధ్య ఇముడలేక, 1923 తర్వాత రాజకీయాలు తనకు వద్దని దూరంగా జరిగారు.

తాను వ్యక్తిగా కొత్త జీవితానికి శ్రీకారం చుట్టారు. తెలుగు నాట జానపద కళా రూపాల పునరుద్ధరణకు, గ్రంథాలయాల వ్యాప్తికి గోపాల కృష్ణయ్య ఇతోధికంగా కృషి చేశారు. ఆయన ప్రచారం చేసిన జానపద కళారీతులు – తోలు బొమ్మలాట, జముకుల కథ, బుర్రకథ, వీధి నాటకాలు, సాము గరిడీలు, గొల్ల కలాపం, బుట్ట బొమ్మలు, కీలు గుర్రాలు, వాలకాలు, గోసంగి, గురవయ్యలు, సరదా కథ, కిన్నెర కథ, కొమ్ము బూర, జోడు మద్దెల, పల్లె సుద్దులు, తూర్పు భాగోతం, చుట్టు కాముడు, పిచ్చికుంట్లవాళ్ళ కథ, సాధనా శూరులు, పలనాటి వీర విద్యావంతులు తదితరాలు ఉన్నాయి.

'సాధన' అనే ఇంగ్లీషు పత్రిక, 'రామదండు అనే తెలుగు పత్రికలు నడిపారు. కాంగ్రెస్ వారి అవలక్షణాలను నాడే ఎత్తి చూపిన పత్రికలు అవి. అటువంటి పత్రికలను మూతపడే వరకు ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు శ్రమించారు. వ్యక్తుల్లో ఇంత సంకుచిత భావం, ఈర్ష్యా ద్వేషాలు వుంటాయని దుగ్గిరాల భావించలేదు. అటువంటి నాయకుల మధ్య కలిసి పని చేయటం కన్నా రామభక్తుడిగా శేష జీవితం గడపటం మంచిదను కున్నారు.

తన భార్య ఆభరణాలు, వెండికంచం అమ్మిన డబ్బులతో కోదండ రామాలయం, రామలింగేశ్వర ఆలయం నిర్మాణం చేపట్టాలని భావించి పునాదుల వరకు నిర్మించారు. తన యావదాస్తి ఆ దేవాలయాలకే చెందాలని బహిరంగ వీలునామా రాసి ఆంధ్ర పత్రికలో ప్రకటించారు.

గుంటూరులో చిన్న ఇంట్లో మకాం మారగా అప్పటికే ఆయనకు క్షయవ్యాధి సోకింది. సొంత ఇంటిలో కన్ను మూయాలన్న కోరికతోనే గుంటూరులో ఊరికి చివరిలో చిన్న ఇల్లు నిర్మించే యత్నం చేశారు. కిటికీలు, తలుపులు కాకుండానే అంత్య కాలం అందులో గడపాలని గృహ ప్రవేశ తంతు ముగించారు. తనకు అన్నింటికీ ఆ రాముడే దిక్కు. అన్నీ రామలీలలే అని చెప్పుకున్నారు దుగ్గిరాల. 28 మే, 1928న గృహప్రవేశం చేసి చుట్టూ వున్న పేదలకు అన్నదానం చేశారు. తన జీవితం అయి పోయిందని ఆయనకు అర్థమై, జూన్ 10న వైద్యుడు చూసి పరవాలేదని చెప్పినా దుగ్గిరాల గోపాలకృష్ణయ్య నమ్మలేదు.

ఆ రాత్రి తన మంచం పక్కన ఒక చాప పరచి వుంచమని కోరారు. రాత్రి పదిగంటల వేళ బాగా దగ్గుతూ, తనను మంచంమీద నుండి చాపమీదికి మార్చమన్నారు. అలా చాపమీద పరుండి తన ఇష్ట దైవమైన రాముని స్మరిస్తూ రాత్రి 10.45 సమయంలో ప్రాణం వదిలారు దుగ్గిరాల. ఆంధ్రరత్న బ్రతికింది కేవలం నాలుగు పదుల లోపే అయినా, విలువలతో కూడిన నిస్వార్థ సేవా నిరతికి ప్రతిరూపమైన దుగ్గిరాల జీవితం ఎందరికో ఆదర్శం. జూన్ 10, 1928 లో గోపాలకృష్ణయ్య మరణించారు.



–రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

## ఈదురుగాలుల బీభత్సం: కుప్ప కూలిన భద్రాద్రి గ్రానైట్ షేడ్ లు

### కోటి రూపాయల నష్టం... ఆదుకోవాలని వేడుకోలు




కరీంనగర్, జూన్ 1:(నేటినిజం ప్రతినిధి) కొత్తపల్లి మండలం బావ్‌పేట ఆసిఫ్‌నగర్ వద్ద ఇటీవల వీచిన బలమైన ఈదురుగాలులకు 'భద్రాద్రి గ్రానైట్స్' పరిశ్రమ షెడ్లు కుప్పకూలాయి. ఈ ప్రమాదంలో భారీ గ్రానైట్ కటింగ్ యంత్రాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

సుమారు కోటి రూపాయలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని నిర్వాహకులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రకృతి వైపరీత్యంతో తీవ్రంగా నష్టపోయిన తమను ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.

## 19 పతకాలు గెలిచిన భారత బృందానికి ప్రధాని అభినందనలు

న్యూఢిల్లీ, జూన్ 1:22వ ఆసియా అండర్ 20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ క్రీడల్లో అద్భుతంగా రాణించిన భారత బృందాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభినందించారు.

ఛాంపియన్‌షిప్‌లో 10 స్వర్ణాలతో సహా 19 పతకాలు సాధించిన భారత బృందాన్ని ప్రధానమంత్రి ప్రశంసించారు.

భారతీయ యువ అథ్లెట్ల సంకల్పాన్నీ, ప్రతిభనీ ఈ విజయం ప్రతిబింబిస్తోందని ప్రధానమంత్రి అన్నారు. భవిష్యత్తులో మరింత మంది క్రీడాకారులు తయారయ్యేందుకు ఈ విజయాలు భారతీయ యువతకు స్ఫూర్తినిస్తాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు."22వ ఆసియా అండర్ 20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో 10 స్వర్ణాలతో సహా 19 పతకాలు గెలిచిన భారత బృందానికి అభినందనలు. భారతీయ యువ క్రీడాకారుల సంకల్పాన్నీ, ప్రతిభనీ ఈ అత్యుత్తమ ప్రదర్శన ప్రతిబింబిస్తోంది. భవిష్యత్తులో మరింత మంది క్రీడలవైపు వచ్చేందుకు భారతీయ యువతకు ఈ విజయాలు స్ఫూర్తినిస్తాయని ఆశిస్తున్నాను."

## బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి మృదుల

### -అభినందించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రతాపరామకృష్ణ




రాజన్న సిరిసిల్ల, జూన్ 1:(నేటినిజం ప్రతినిధి): వేములవాడలోని కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థిని గజ్జెల మృదుల ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి పాఠశాలకు మరోసారి గుర్తింపు తీసుకొచ్చింది. 2025?26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్ఎస్‌సీ పరీక్షల్లో 586 మార్కులు సాధించిన మృదుల, తన ప్రతిభతో ట్రిపుల్ ఐటీ ప్రవేశానికి అర్హత సాధించింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు ప్రతాప్ రామకృష్ణ, పాఠశాలల డైరెక్టర్ సన్నిధి వెంకట కృష్ణ విద్యార్థినిని శాలువాతో సత్కరించి అభినందించారు. మృదుల సాధించిన విజయం పాఠశాలకు గర్వకారణమని, ఆమె కృషి, పట్టుదలకు తగిన గుర్తింపు లభించిందని వారు పేర్కొన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో కృష్ణవేణి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. విద్యార్థిని తల్లిదండ్రులను కూడా ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి సహకారం, ప్రోత్సాహమే ఈ విజయానికి బలమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హెల్త్ స్కీమ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### – బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చెన్నమనేని వికాస్

రాజన్న సిరిసిల్ల, జూన్ 1:(నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం అమలు చేయనున్న హెల్త్ స్కీమ్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి డా. చెన్నమనేని వికాస్ విమర్శించారు.

ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందించకుండానే, స్కీమ్ కింద సేవలు అందించే ఆస్పత్రుల జాబితా ప్రకటించకుండానే జీతాల నుంచి 1.5 శాతం కోత విధించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.

ఉద్యోగులకు క్యాష్‌లెస్ వైద్యం అందిస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, ఏ ఆస్పత్రుల్లో, ఏ చికిత్సలకు, ఎలాంటి నిబంధనలతో సేవలు అందుతాయనే అంశాలపై స్పష్టత లేదని పేర్కొన్నారు. హెల్త్‌కేర్ ట్రస్ట్ ఏర్పాటు కాకముందే, పూర్తి విధివిధానాలు వెల్లడించకుండానే ఉద్యోగుల జీతాల నుంచి కోతలు ప్రారంభించడం దారుణమని విమర్శించారు. ఉద్యోగ సంఘాలతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా, వారి అభిప్రాయాలు తీసుకోకుండా జీతాల్లో కోతలు విధించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని అన్నారు. పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బిల్లుల కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్న సమయంలో వారి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ప్రభుత్వం కొత్త భారాలు మోపుతోందని ఆరోపించారు.

ముందుగా ప్రచారం చేసి, తర్వాత అమలు గురించి ఆలోచించడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

హెల్త్ స్కీమ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, గుర్తింపు పొందిన ఆస్పత్రుల జాబితా, చికిత్స ప్యాకేజీలు, అర్హతలు తదితర అంశాలపై ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఐఐటీ అడ్వాన్స్‌డ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల సత్తా




కరీంనగర్, జూన్ 1:(నేటినిజం ప్రతినిధి) ఐఐటీ–జేఈఈ (అడ్వాన్స్‌డ్)–2026 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో విశిష్ట ర్యాంకులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారని సంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. నేడు విడుదలైన ఫలితాల్లో కె. ప్రజ్ఞాన్ దీపక్ ఆల్ ఇండియా 75వ ర్యాంకు సాధించగా, సి.హెచ్. లక్ష్మీహాసిని 400, ఎన్. రత్నప్రకాశ్ 497, బి. లిఖిత్ సాయి 785, ఎం. వశిష్ఠ 800, బి. స్పందన 954 ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు.అలాగే కె. ధనుష్ 1294, ఎం. జోహన్ 1400, పటేల్ అక్షయ 1488, సి.హెచ్. అభిరామ్ రావు 1618, ఎ. సత్యవర్ధన్ 1678 ర్యాంకులు సాధించి సంస్థ ఖ్యాతిని మరింత పెంచారని పేర్కొన్నారు. ఈ ఫలితాల్లో వెయ్యిలోపు 6 మంది, రెండువేలలోపు 11 మంది, మూడువేలలోపు 19 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం విశేషమన్నారు.పటిష్టమైన ప్రణాళికతో బోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల కృషి ఈ విజయానికి కారణమని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో తొలిసారిగా ఐఐటీ కోచింగ్‌ను అందించి అనేక మంది విద్యార్థులను ప్రతిష్మాత్మక ఐఐటీల్లో ప్రవేశాలు పొందేలా తీర్చిదిద్దిన సంస్థగా అల్ఫోర్స్ నిలిచిందన్నారు.ఐఐటీ–2026లో రాణించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని డాక్టర్ నరేందర్ రెడ్డి అభినందించారు. రానున్న నీట్–2026 ఫలితాల్లో కూడా అల్ఫోర్స్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశాలకు కరీంనగర్ మేయర్‌కు ఆహ్వానం

కరీంనగర్, జూన్ 1:(నేటినిజం ప్రతినిధి) ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఋషికేశ్‌లో జరగనున్న ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117వ సమావేశాలకు కరీంనగర్ మేయర్ కొలగని శ్రీనివాస్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఋషికేశ్ నగరపాలక సంస్థ తరఫున సోమవారం ఆయనకు అధికారిక ఆహ్వాన పత్రాన్ని పంపించారు.జూన్ 3, 4 తేదీల్లో ఋషికేశ్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమావేశాలకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ అధ్యక్షురాలు రేణు బాల గుప్తా అధ్యక్షత వహించనున్నారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామితో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు హాజరుకానున్నారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ కార్యదర్శి మనోజ్ గుప్తా, ఋషికేశ్ మేయర్ రణజాయ్ పాన్వర్ ఆహ్వానం మేరకు మేయర్ కొలగని శ్రీనివాస్ సమావేశాల్లో పాల్గొననున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మేయర్లు హాజరయ్యే ఈ సమావేశాల్లో పట్టణాభివృద్ధి, నగర పాలన, ప్రజా సేవల మెరుగుదల, స్మార్ట్ సిటీ కార్యక్రమాలు, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. కరీంనగర్ నగర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఈ వేదికపై ప్రస్తావించడంతో పాటు, ఇతర నగరాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసే అవకాశం ఈ సమావేశాల ద్వారా లభించనుందని మేయర్ వర్గాలు తెలిపాయి.



## పశ్చిమలో యోగాంధ్ర కార్యక్రమాలు

అమరావతి, జూన్ 1:అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో యోగాంధ్ర–2026 కార్యక్రమాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ వీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో యోగాంధ్ర–2026 నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 7వ తేదీ నుంచి 14 రోజుల పాటు జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు యోగా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రతి వర్గానికి యోగాను చేరువ చేయాలని సూచించారు.

జూన్ 21న జిల్లా కేంద్రంలో వెయ్యి మందితో భారీ యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలోని రెండు ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేక యోగా సెషన్లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అథ్లెటిక్స్ అండ్ స్పోర్ట్స్ గ్రూప్స్ థీమ్‌తో ప్రత్యేక యోగా ఈవెంట్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 13న నరసాపురం వలందర్ రేవు ప్రాంగణంలో, జూన్ 14న పెనుగొండలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో 500 మందితో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలో అందుబాటులో ఉన్న యోగా ట్రైనర్లతో పాటు మరింత మందికి శిక్షణ ఇచ్చి యోగా శిక్షకులుగా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

పార్కులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులు తదితర ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.